# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2

ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | మంగళవారం 18-6-2024 | NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 | సంపుటి :30 | సంచిక:248 | పేజిలు:6 | వెల: రూ.1/-


## ఝార్ఖండ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో నలుగురు మావోయిస్టులు మృతి

రాంచీ జూన్ 17 (ఎక్స్ ప్రెస్ న్యూ స్):: ఝార్ఖండ్‌లోని వెస్ట్‌సింగ్‌భూమ్ జిల్లా టోన్టో, గోయిల్‌కేరా ప్రాంతాల్లో సోమవారం ఉదయం ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. మరో ఇద్దరు మావోలను పోలీసులు అరెస్టు చేశారు. ఘటనా స్థలం నుంచి పెద్ద ఎత్తున ఆయుధాలు, మందుగుండు సామాగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

### చురక

మత్తులోనే వింత వింత
మరలుగొల్పె గమ్మత్తులు
బానిసైతె ఎవరికయినా
బ్రతుకంతా విపత్తులు
ప్రభుత్వాల కనుసన్నలో
ప్రబలే వ్యాపార దందా
ప్రజలను కాటేస్తూ ఉన్న
పెట్టలేరా దాన్ని బొంద



-వేల్పుల నారాయణ
9440433475

# పశ్చిమ బెంగాల్‌లో ఘోర రైలు ప్రమాదం

**–15 మంది ప్రయాణికులు మృతి, 60 మంది గాయాలు**
**– రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రధాని మోదీ తీవ్ర దిగ్భ్రాంతి**
**-మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి రూ.2.5 లక్షలు, స్వల్పంగా గాయపడిన బాధితులకు రూ.50,000 ఎక్స్‌గ్రేషియా**



కోల్ కతా జూన్ 17 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);పశ్చిమ బెంగాల్ లోని రంగపాణి స్టేషన్ సమీపంలో ఈరోజు ఉదయం ఘోర రైలు ప్రమాదం చోటుచేసుకుంది. ఆగి ఉన్న కాంచనజంగా ఎక్స్‌ప్రెస్ రైలును వెనుక నుంచి వేగంగా వచ్చిన గూడ్స్ రైలు ఢీకొట్టింది. దీంతో కాంచనజంగా ఎక్స్‌ప్రెస్ రైలు వెనుక మూడు బోగీలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ ప్రమాదంలో ఇప్పటి వరకు 15 మంది ప్రయాణికులు మృతి చెందగా, 60 మంది గాయపడ్డారు. ఈ ప్రమాదం జరిగిన వెంటనే రెస్క్యూ టీమ్‌లు, స్థానికులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపడుతున్నాయి. ఈ ఘటనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రధాని మోదీ విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. 'డార్జిలింగ్‌లో జరిగిన రైలు ప్రమాదంలో పలువురు మరణించిన వార్త బాధ కలిగించింది.కాగా ఎక్స్‌ప్రెస్, గూడ్సు రైలు ఢీకొన్న ఘటనలో మృతులకు ఎక్స్‌గ్రేషియాను పెంచారు. దీంతో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ హుటాహుటిన డార్జిలింగ్ చేరుకున్నారు. ప్రమాద ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మృతుల కుటుంబాలకు ప్రధాన మంత్రి జాతీయ సహాయనిధి నుంచి రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా, క్షతగాత్రులకు రూ.50 వేలు చొప్పున ప్రకటించారు. ఆ తర్వాత ఎక్స్‌గ్రేషియా పెంపును అశ్విని వైష్ణవ్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ప్రకటించారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి రూ.2.5 లక్షలు, స్వలంగా గాయపడిన బాధితులకు రూ.50,000 ఎక్స్‌గ్రేషియా కంపెన్సేషన్ ఇవ్వనున్నట్టు ప్రకటించారు.

# మానవత్వం పరిమళించింది..

## ఆర్టీసీ సిబ్బందికి రేవంత్, సజ్జనార్ ప్రశంసలు

**-తల్లీబిడ్డలను కాపాడిన ఆర్టీసీ సిబ్బందిపై రేవంత్ సజ్జనార్ ప్రశంసలు**
**-కరీంనగర్ బస్టాండ్‌లో అకస్మాత్తుగా మహిళకు పురిటినొప్పులు**
**-చీరలు అడ్డుకట్టి ప్రసవం చేసిన ఆర్టీసీ మహిళా సిబ్బంది**
**-108 అంబులెన్స్ రాగానే ప్రభుత్వ ఆసుపత్రికి తరలింపు**

హైదరాబాద్, జూన్ 17 :తెలంగాణ రాష్ట్రంలోని కరీంనగర్ బస్‌స్టాండ్‌లో అకస్మాత్తుగా నొప్పులు ప్రారంభమైన గర్భవతికి కాన్పు చేసిన ఆర్టీసీ మహిళా స్వీపర్లు, సూపర్‌వైజర్లపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి టీజీఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ ప్రశంసలు కురిపించారు. ఈ మేరకు రేవంత్ రెడ్డి ట్విట్ చేస్తూ, కరీంనగర్ బస్ స్టేషన్ లో గర్భిణికి కాన్పు చేసి మానవత్వం చాటుకున్న ఋఊఖీఅ మహిళా సిబ్బందికి నా అభినందనలు. మీరు సకాలంలో స్పందించడం వల్ల తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నారు. విధి నిర్వహణలో కూడా మీరు ఇలాగే మంచి పేరు తెచ్చుకోవాలని ఆశిస్తున్నాను అని పేర్కొన్నారు.

ఇక ఆర్టీసీ ఎండి సజ్జనార్ తన ట్విట్ లో మానవత్వం పరిమళించిందంటూ అభినందనలు తెలియజేశారు. సిబ్బంది సకాలంలో స్పందించడంతో తల్లీబిడ్డల ప్రాణాలు నిలిచాయన్నారు. ప్రజలకు రవాణా సేవలు అందించడంతో పాటు మానవత్వం చాటుకోవడంలోనూ తామేమీ తక్కువ కాదని ఆర్టీసీ సిబ్బంది నిరూపించారని అన్నారు.

వివరాలిలా.. ఊరెళ్దామని కరీంనగర్ బస్ స్టేషన్‌కు వచ్చిన ఓ గర్భిణికి అక్కడే నొప్పులు మొదలవడంతో ఆర్టీసీ మహిళా సిబ్బంది చీరలు అడ్డుపెట్టి డెలివరీ చేశారు. 108 వచ్చే లోపు సాధారణ ప్రసవం చేసి తల్లిని, బిడ్డను ఆసుపత్రికి తరలించారు. ఒడిశాకు చెందిన వలస కూలీ కుమారి ఆమె భర్తతో కలిసి పెద్దపల్లి జిల్లా కాట్నపల్లి ఇటుక బట్టీలో పనిచేస్తోంది. ఆదివారం సాయంత్రం కుంట వెళ్దామని కరీంనగర్ బస్టాండ్‌లో భద్రాచలం బస్సు ఎక్కేందుకు వచ్చారు. కుమారి నిండు గర్భిణి కాగా, ఆమెకు బస్టాండ్‌లోనే నొప్పులు మొదలయ్యాయి. వెంటనే భర్త ఆమెను పక్కన పడుకోబెట్టి సాయం కోసం ఆర్టీసీ అధికారులను వేడుకున్నాడు.

దీంతో వారు 108కు సమాచారమిచ్చారు. ఈలోగా నొప్పులు ఎక్కువ కావడంతో ఆర్టీసీ మహిళా స్వీపర్లు, సూపర్‌వైజర్లు ముందుకు వచ్చారు. చీరలను అడ్డుపెట్టి సాధారణ డెలివరీ చేయగా ఆడపిల్ల పుట్టింది. కొద్దిసేపటికి 108 అంబులెన్స్ రాగానే తల్లీబిడ్డలను కరీంనగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నట్టు తెలిపారు. గర్భవతికి అండగా నిలిచిన సిబ్బందిపై ప్రశంసలు వెల్లువెత్తాయి.

# రియాసి ఉగ్రదాడి కేసు ఎన్ఐఏకు అప్పగింత

**– కేంద్ర హోం మంత్రిత్వ శాఖ కీలక నిర్ణయం**

న్యూఢిల్లీ, జూన్ 17 జూన్ 17 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: రియాసి ఉగ్రదాడి కేసు విషయంలో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సోమవారం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ దాడి కేసు దర్యాప్తును జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)కు అప్పగించింది. ఈ ఉగ్ర దాడిపై చట్టవ్యతిరేక కార్యకలాపాలకు సంబంధించిన కేసు ఇప్పటికే ఎన్ఐఏ నమోదు చేసిన విషయం విధితమే. ఈ ఉగ్ర దాడి వెనుక పెద్ద కుట్ర ఉందని ఎన్ఐఏ భావిస్తుంది. ఆ క్రమంలో ఈ కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తుంది.మరోవైపు ఈ దాడితో సంబంధముందని భావిస్తున్న 50 మంది అనుమానితులను భద్రతా దళాలతోపాటు పోలీసులు ఇటీవల అరెస్ట్ చేసి.. ప్రశ్నిస్తున్నారు. ఇక ఈ దాడిలో కీలకంగా వ్యవహరించిన ముగ్గురు ఉగ్రవాదులకు సంబంధించిన ఊహా చిత్రాలను పోలీసులు విడుదల చేశారు. నిందితులకు సంబంధించిన సమాచారం అందిస్తే రూ. 20 లక్షల రివార్డ్ అందజేస్తామని ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే.జూన్ 9వ తేదీన జమ్ము కాశ్మీర్ రియాసీలోని శివ ఖోరి నుంచి కాట్రాకు భక్తులతో వెళ్తున్న బస్సుపై ఉగ్రవాదులు ఆకస్మాత్తుగా కాల్పులు జరిపారు. దీంతో డ్రైవర్ వేగాన్ని పెంచడంతో బస్సు లోయలో పడిపోయింది. ఈ ఘటనలో 9 మంది భక్తులు మరణించారు. మరో 33 మంది తీవ్రంగా గాయపడ్డారు.అయితే ఈ ఘటన జరిగిన సమయంలోనే న్యూఢిల్లీలో రాష్ట్రపతి భవన్‌లో ప్రధానిగా నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకారం చేశారు. ఇక ఈ దాడిపై సమాచారం అందుకున్న ప్రధాని మోదీ.. వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని ఆ రాష్ట్ర ఉన్నతాధి కారులను ఆదేశించారు.ఇటీవల జమ్ము కాశ్మీర్‌లో వరుసగా ఉగ్రవాద దాడులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్రంలో శాంతి భద్రతలపై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా అధ్యక్షతన ఆదివారం న్యూఢిల్లీలో ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. ఉగ్రవాద దాడులను అణిచివేసేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు కేంద్ర మంత్రి అమిత్ షా సూచించారు.అలాగే జూన్ 29వ తేదీ నుంచి అమర్నాథ్ యాత్ర ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ సరిహద్దులతోపాటు నియంత్రణ రేఖ వద్ద భారీగా భద్రత దళాలను మోహరించాలని ఉన్నతాధికారులను అమిత్ షా ఆదేశించారు.

# రాష్ట్రంలో గంజాయి, మత్తు మాఫియాలను ఉక్కు పాదంతో అణిచివేస్తాం

**– బాలిక కుటుంబానికి అండగా రాష్ట్ర ప్రభుత్వం ఉంటుంది**
**– బాలిక మృతికి కారకులను కఠినంగా శిక్షిస్తాం**
**– బాధిత బాలిక కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి సీతక్క**

హైదరాబాద్ జూన్ 17 (ఎక్స్ ప్రెస్ న్యూస్); మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం లక్ష్మ తండా కు చెందిన బాధిత బాలిక కుటుంబాన్ని రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి మరియుమహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క పరామర్శించారు. జరిగిన సంఘటనపై వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు.

బాలిక కుటుంబానికి ప్రభుత్వ పరంగా అండగా ఉంటామని హామి ఇచ్చారు.. రాష్ట్రంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని అన్నారు.. రాష్ట్రంలో గంజా,మత్తు మాఫియాలను ఉక్కు పాదంతో అణిచి వేస్తున్నామని అన్నారు..

డ్రగ్స్, గంజాయిని వల్ల వ్యక్తి యొక్క ఆరోగ్యంతో పాటు సమాజానికి సైతం నష్టం చేస్తున్నాయని అన్నారు.

రాష్ట్రంలో ఆగాయి త్యాలు జరగకుండా వాటి మూలలపై దృష్టి సారిస్తున్నామని తెలిపారు.

డ్రగ్స్, గంజాయి మాదకద్రవ్యాల వినియోగంపై పోలీసు శాఖ ఉక్కు పాదం మోపుతుందని మంత్రి తెలిపారు. జరిగిన సంఘనపై పూర్తి వివరాలు సేకరించి దోషులనులను శిక్షంచే విధంగా అధికారులను



కోరారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటాం. బాధిత కుటుంబానికి అండగా ప్రభుత్వం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ బలరాం బలరాం,ఎంఎల్ఏ రామచంద్రు నాయక్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జమ్మూ కశ్మీర్ ఎన్నికల ఇన్ ఛార్జిగా కిషన్ రెడ్డి



**–త్వరలో జమ్మూకశ్మీర్, హరియాణా,**
**–మహారాష్ట్ర, ఝార్ఖండ్‌లలో ఎన్నికలు**
**–ఈ నాలుగు రాష్ట్రాలకు ఎన్నికల**
**–బీజేపీ ఇన్‌ఛార్జ్‌ల నియామకం**
**–హరియాణాకు ఇన్‌ఛార్జ్‌లుగా ధర్మేంద్ర ప్రధాన్, బిప్లవ్ దేవ్**
**–మహారాష్ట్ర బాధ్యతలు భూపేంద్ర యాదవ్, అశ్వినీ వైష్ణవ్‌లకు**

హైదరాబాద్, జూన్ 17 :త్వరలో ఎన్నికలు జరగనున్న జమ్మూకశ్మీర్, హరియాణా, మహారాష్ట్ర, ఝార్ఖండ్‌లకు బీజేపీ ఇన్‌ఛార్జ్‌లను నియమించింది. దీనిలో భాగంగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి జమ్మూకశ్మీర్ బాధ్యతలు అప్పగించింది. అలాగే హరియాణాకు ఇన్‌ఛార్జ్‌లుగా ధర్మేంద్ర ప్రధాన్, బిప్లవ్ దేవ్‌లను నియమించింది. మహారాష్ట్ర బాధ్యతలు భూపేంద్ర యాదవ్, అశ్విని వైష్ణవ్‌కు అప్పగించడం జరిగింది. ఇక శివరాజ్ సింగ్ చౌహాన్, హిమంత బిశ్వశర్మలను ఝార్ఖండ్ ఇన్‌ఛార్జ్‌లుగా నియమిస్తున్నట్లు ప్రకటించింది.

# నెల్లూరు హైవేపై పెద్దపులి

అమరావతి, జూన్ 17 : నెల్లూరు జిల్లాలో పెద్దపులి కలవరం సృష్టించింది. జనారణ్యంలోకి వచ్చిన ఈ పెద్దపులి యధాప్రకారం ఆహారాన్వేషణలో కలకలం రేపింది. జనం భయబ్రాంతులయ్యారు. వివరాలు ఇలా ఉన్నాయి. మర్రిపాడు మండలం, కదిరినాయుడుపల్లి అటవీ ప్రాంతంలో పెద్దపులి సంచరిస్తోంది . కదిరినాయుడిపల్లి వద్ద నెల్లూరు నుంచి ముంబాయి వెళ్ళే జాతీయ రహదారిపై వాహనాలపై పెద్దపులి దాడి చేసింది. ఒక్క సారిగా పెద్దపులి వాహనాలపై దాడి చేయడంతో ప్రయాణీకులు భయభ్రాంతులకు గురయ్యారు. పెద్దపులి సంచారంతో అటవీ ప్రాంత గ్రామాల్లో ఒక్కసారిగా అలజడి నెలకొంది. ఈ సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు ఘటన ప్రాంతానికి చేరుకుని సమీక్షిస్తున్నారని సమాచారం.

# దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జిపై మహిళ ఆత్మహత్యాయత్నం..



హైదరాబాద్, జూన్ 17 :దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జిపైఓ మహిళ(25) ఆత్మ హత్యా యత్నా నికి పాల్పడింది. కేబుల్ బ్రిడ్జి పై నుంచి దుర్గం చెరువులోకి దూకడానికి యత్నించిన మహిళను మాదాపూర్ ట్రాఫిక్ పోలీసులు కాపాడారు. అప్పటికే తాను నిద్రమాత్రలు మింగానని పోలీసులకు తెలపడంతో వెంటనే వారు స్థానిక హాస్పిటల్‌కు తరలించారు. ప్రేమ వ్యవహారమా.. లేక కుటుంబ కలహాల అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. ఆత్మహత్యాయత్నానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# మెదక్ జిల్లాలో విషాదం..

## అల్లుడి మరణం తట్టుకోలేక అత్త మృతి

హైదరాబాద్, జూన్ 17 :మెదక్ జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. అల్లుడి మృతి తట్టుకోలేక అత్త మృతిచెందింది. ఈ విషాదకర సంఘటన చేగుంట మండలం మక్కరాజుపేటలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే..గ్రామానికి చెందిన నర్సింలు(53) అనే వ్యక్తి అనారోగ్యంతో నిన్న కన్నుమూశాడు. నర్సింలు మృతి వార్త తెలిసినప్పటి నుంచి ఆయన అత్త నర్సవ్వ(68) రాత్రంతా రోధిస్తూ గుండెపోటుతో మృతి చెందింది. నర్సింలు, నర్సవ్వ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

### నేటి కందం– నేటికీ అందం

నేటినిజం నేటినిజంనేటినిజం నేటినిజం నేటినిజంనేటినిజం నేటినిజం నేటినిజంనేటినిజం నేటినిజంనేటినిజం నేటినిజం

జ్ఞానముతో జేసినపని
మానిత విజయమ్ము తోడ మన్నన నొసగన్
పూనికతో జరుపవలయు
నానందమునిడు విహార యాత్రలను మొగిన్

(జూన్ 18 ప్రపంచ విహారయాత్రా దిన..)



-రాధశ్రీ
సెల్:9494481210

# హైదరాబాద్‌లో భారీ వర్షం..

హైదరాబాద్, జూన్ 17 : హైదరాబాద్‌లో సోమవారం ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో వర్షం కురవగా.. పెనుగాలులకు పలుచోట్ల చెట్లకొమ్మలు విరిగిపడ్డాయి. గచ్చిబౌలి, మాదాపూర్, రాయదుర్గం, ఖైరతాబాద్, పంజాగుట్ట, లక్డీకపూల్, అమీర్‌పేట, రాజేంద్రనగర్, అత్తాపూర్, ఎస్ఆర్‌నగర్, ఎర్రగడ్డ, యూసుఫ్‌గూడ, లంగర్‌హౌస్, గండిపేట, శివరాంపల్లిలో భారీ వర్షం నమోదైంది. అలాగే పంజాగుట్ట, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, అమీర్‌పేట, బేగంపేట, సికింద్రాబాద్, గచ్చిబౌలి, మణికొండ, షేక్‌పేట, కొండాపూర్, హైటెక్ సిటీ తదితర ప్రాంతాల్లో ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. పలుచోట్ల గాలులకు చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. ఒక్క సారి వర్షం కురవడంతో వాహన దారులు ఇబ్బందులకు గురయ్యారు. పలుచోట్ల ట్రాఫిక్ అంతరాయం కలిగింది.

# జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇచ్చింది కాంగ్రెస్సే, ఇచ్చేది కాంగ్రెస్సే

**– డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క**

ఖమ్మం, జూన్ 17 :(నేటినిజం ప్రతినిధి): రాష్ట్రంలోని జర్నలిస్టులకు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ఇండ్ల స్థలాలు ఇవ్వడం జరిగిందనీ, రాబోవు రోజుల్లోనూ జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించడంతో పాటు ఇండ్ల స్థలాలు ఇచ్చేది కూడా మా ప్రభుత్వమేనని తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క అన్నారు. దశాబ్దకాలంగా పెండింగ్ లో ఉన్న ఇండ్ల స్థలాలు, జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ టీయూడబ్ల్యూజే (టీజేఎఫ్) ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం డిప్యూటీ సీఎంను కలిసి పలు సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. జర్నలిస్టుల సమస్యల సమస్యలను పరిష్కరించడంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందనీ, ప్రస్తుతం ఉన్న ప్రజాప్రభుత్వం ప్రజాపాలన అని రాష్ట్రంలోని జర్నలిస్టుల సమస్యలు దశలవారీగా పరిష్కరిస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభమైన మీడియా ప్రజల సమస్యలు పరిష్కరించడంలో ముందు వరుసలో ఉండాలని అన్నారు. రాష్ట్రంలో ప్రజలు కోరుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆశీర్వాదంతో అభివృద్ధి సంక్షేమంలో ముందడుగు వేస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్రంలో ఖమ్మంతో పాటు పలు జిల్లాల్లో గత ప్రభుత్వం కేవలం మాటలు చెప్పి జర్నలిస్టులను మోసం చేసిందని భట్టి విక్రమార్క విమర్శించారు. మాది మాటల ప్రభుత్వం కాదనీ, చేతల ప్రభుత్వమని జర్నలిస్టులకు అండగా నిలుస్తామని అన్నారు.



–డిమాండ్లపై వినతి పత్రం అందజేత..

ఖమ్మం జిల్లాలో జర్నలిస్టుల సమస్యలపై టీయూడబ్ల్యూజే(టీజేఎఫ్) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పలు సమస్యలపై డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు వినతి పత్రం సమర్పించారు. ప్రధానంగా జర్నలిస్టుల ఇళ్ళ స్థలాల సమస్యను అనేక సంవత్సరాల నుండి చేసిన పోరాటాల ఫలితంగా గత ముగ్గురు ముఖ్యమంత్రుల సాక్షిగా నాటి తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఖమ్మం జిల్లా జర్నలిస్టులకి వెంటనే ఇళ్ళ స్థలాలు ఇవ్వాలని ఆదేశాలు ఇప్పటం జరిగిందని వినతిపత్రం పేర్కొన్నారు. ఈ మేరకు 26.05.2023న జి.ఓ నెం.147 ప్రకారం 23 ఏకరాల రెండు కుంటల భూమి. జర్నలిస్టులకు కేటాయిస్తూ జి.ఓ జారీ చేశారు. ఇందులో 8 ఎకరాల రెండు కుంటల భూమికి అధిక రేట్లు ఉన్నందున ప్రత్యామ్నాయ భూమిని కేటాయించాలి. జర్నలిస్టులందరికి 23ఏకరాల ఇండ్ల స్థలాలుగా ఎకరాల భూమి ఇండ్ల స్థలాలుగా పంపిణి చేయాలి. 14 ఏకరాలు మాత్రమే కేటాయిస్తాము. మిగిలిన భూమిని తరువాత ఇస్తాం అని జర్నలిస్టులను మోసగించే పనిని అధికారులు చేస్తున్నారు. ఈ విధానాన్ని విరమించుకోవాలని అధికారులని వినతి పత్రంలో పేర్కొన్నారు. 2024 వరకు ఉన్న అర్హులు అయిన జర్నలిస్టులు అక్రిడిటేషన్ ఉన్న జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతున్నాము. అక్రిడిటేషన్ గడువు ఈ నెల చివరితో ముగుస్తున్నందున, కార్డులను రెన్యువల్ చేయాలని కోరుతున్నాము. లేదా కోత్త కార్డులు ఇవ్వాలి. జర్నలిస్టుల బస్ పాసులను రెనువల్ చేయాలి. హెల్త్ కార్డులను పునరిద్దరించాలనీ, రైల్వే పాసులు పునరుద్దరించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. అక్రిడిటేషన్ కార్డు ఉన్న ప్రతీ జర్నలిస్టు కు రాష్ట్ర వ్యాప్తంగా బస్ పాస్ లో 1/3 రాయితిని వర్తివంచేయాలని కోరారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను కలిసి వినతిపత్రం సమర్పించిన వారిలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట ఆదినారాయణ, చిర్రా రవి, డిప్యూటీ సెక్రెటరీ మందటి వెంకటరమణ, జిల్లా ఉపాధ్యక్షులు రామిశెట్టి విజేత, వనం నాగయ్య, మందుల ఉపేందర్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్, టెంజూ పట్టణ అధ్యక్షులు యలమందల జగదీష్, జిల్లా నాయకులు బండి కుమార్, కొరకొప్పుల రాంబాబు, ముత్యాల కోటేశ్వరరావు, బిక్కి గోపి, టీఎస్ చక్రవర్తి, వెంకటకృష్ణ, తోట గణేష్, సంతోష్, పిన్ని సత్యనారాయణ, ఈశ్వరి, వెంకటరెడ్డి, ఉత్కంఠం శ్రీనివాస్, పానకాల రావు తదితరులు పాల్గొన్నారు.

# అవసరమైతేనే బయటకు వెళ్లండి..

**– హైదరాబాద్ వాసులకు మంత్రి పొన్నం సూచన**

హైదరాబాద్, జూన్ 17 :హైదరాబాద్‌లో ఇవాళ భారీ వర్షం కురుస్తోంది. నగరంలోని మాదాపూర్, గచ్చిబౌలి, దుర్గం చెరువు, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, అమీర్‌పేట్, పంజాగుట్ట, యూసుఫ్‌గూడ, బేగంపేట్‌తో పాటు పలు చోట్ల వాన పడుతోంది. ఈ క్రమంలో హైదరాబాద్‌లో కురుస్తోన్న భారీ వర్షాలపై మంత్రి పొన్నం ప్రభాకర్ సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. తాజా పరిస్థితుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా అధికారులకు మంత్రి పొన్నం కీలక సూచనలు చేశారు. భారీ వర్షాలు కురుస్తోన్న నేపథ్యంలో జీహెచ్ఎంసీ, డీఆర్ఎఫ్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముంపు ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని ఆదేశించారు. ప్రజలు అత్యవరసమైతే తప్ప ఇళ్ల నుండి బయటకు రావొద్దని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు.

# కానిస్టేబుల్‌కు రేవంత్ అభినందనలు..

హైదరాబాద్, జూన్ 17 :తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. ట్రాఫిక్ కానిస్టేబుల్ సురేష్‌ను ప్రశంసించారు. యూపీఎస్సీ ప్రిలిమ్స్‌కు వెళ్తున్న ఓ యువతిని కరెక్ట్ సమయంలో పరీక్షా కేంద్రానికి తరలించినందుకు సీఎం రేవంత్.. సురేష్‌ను అభినందించారు.

ఈ మేరకు ట్విట్టర్ వేదికగా స్పందించిన ముఖ్యమంత్రి.. వాహనాల నియంత్రణ మాత్రమే తన డ్యూటీ అనుకోకుండా.. సాటి మనిషికి సాయం చేయడం తన బాధ్యత అని భావించిన ట్రాఫిక్ కానిస్టేబుల్ సురేష్‌కు అభినందనలు.. సురేష్ సహకారంతో సమయానికి పరీక్షా కేంద్రానికి చేరుకున్న సోదరి యూపీఎస్సీ పరీక్షలో విజయం సాధించాలని ఆకాంక్షిస్తున్నాను.. ఆల్ ది బెస్ట్ అని సీఎం రేవంత్ రెడ్డి ట్వీట్ చేశారు.

# శారీరక మానసిక వికాసానికి వేదికలు విహారయాత్రలు !

(18 జూన్ 'అంతర్జాతీయ విహార యాత్రల దినం' సందర్భంగా)

డిజిటల్ యుగపు భూకుగ్రామంలో ఆధునిక వేగవంతమైన ఉరుకుల పరుగుల జీవితం, ఎవ్వరికీ ప్రశాంతత లేదు, విరామం దొరకట్లేదు, అంతు కనిపించడం లేదు, ఫలితం సంతృప్తిని ఇవ్వడం లేదు. జీవితాలు యంత్ర సమానం అయ్యాయి. ఉల్లాస క్షణాలు, అమితానంద దృశ్యాలు కరువయ్యాయి. సంతోషంగా కుటుంబ సభ్యులతో గడిపే ఘడియలు కొన్ని క్షణాలైన బహు అరుదైనాయి. నవ్య నాగరికతలో అమ్మ నాన్నలు ఉద్యోగులుగా, జీవనోపాధిలో తలమునకలయిన పెద్దలుగా, పిల్లలు విద్యార్జనలో బిజీగా ఉండడంతో ఇంట్లో అందరూ కలిసి ఆప్యాయంగా మాట్లాడుకోవడం, ఆటపాటల ఆనందసాగరంలో మునిగితేలడం అసాధ్యమైపోతున్నది. మన యాంత్రిక జీవితాల్లో కొంత ఉపశమనం, ఆరోగ్య పరిరక్షణ వెతుక్కుంటూ ఉల్లాసం కోసం విహార యాత్రలు, ప్రర్యాటక క్షేత్ర దర్శనాలు, విజ్ఞాన వివేకాలను మెరుగుపరుచుకోవడాన్కి విజ్ఞాన యాత్రలు లాంటివి ఎంతగానో ఉపయోగపడతాయని మనకు తెలుసు.

## విజ్ఞాన వివేకాల ఆస్వాదన వేదికలు:

పిక్నిక్ లేదా విహార యాత్రల్లో సహజ ప్రకృతితో మమేకమవుతూ, హరిత దుప్పట్ల మీద కుటుంబ సభ్యులు భోజనాలు చేస్తూ ఆనంద క్షణాలు ఆస్వాదించడం ఓ అద్భుత అవకాశం. దైనందిన జీవన పయనంలోంచి స్వల్ప విరామం తీసుకొని, మానసిక ఉల్లాసం పొందడానికి బంధువులు, స్నేహితులతో విహార యాత్రలు చేయాలనే అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో ప్రతి ఏట 18 జూన్‌న 'అంతర్జాతీయ విహారయాత్రల దినం (ఇంటర్నేషనల్ పిక్నిక్ డే)' పాటించుట జరుగుతున్నది.

1800 మధ్య కాలంలో ఫ్రెంచ్ విప్లవ సమయాన విహారయాత్రల ఆలోచనలు ప్రారంభమైనాయి. 20 జూన్ 2009న లిస్బన్, పోర్చుగల్‌లో 22,000 మందితో నిర్వహించిన అతి పెద్ద విహారయాత్ర 'గిన్నీస్ బుక్ ఆఫ్ రికార్డ్స్'లో కూడా చోటు దక్కించుకుంది.

## ప్రకృతి ఆస్వాదన సదవకాశాలు:

అంతర్జాతీయ విహారయాత్రల దినం రోజున విద్యాలయాలు, కుటుంబాలు విహార యాత్రలు నిర్వహించుట జరుగుతుంది. పలు తినుబండారాలు, శీతలపానీయాలు, స్వీట్లు, పండ్లు, కేక్‌లు, సాండ్‌విచ్చెస్ లాంటి అనేక రకాల ఆహార పదార్థాలతో పాటు క్రీడా వస్తువులు వెంట తీసుకొని విహారయాత్రలకు వెళతారు. ప్రతి ఒక్కరు ప్రకృతి సౌందర్యాలను ఆస్వాదిస్తూ, తమ వయసును మరిచి, పిల్లలుగా మారిపోతూ, సాంస్కృతిక కార్యక్రమాలతో అమితానందాన్ని పొందుతూ, మానసిక ఉల్లాసాన్ని పొందుటకు, మనసు తేలిక పరుచుకునేందుకు విహారయాత్రలు ఉపయోగపడతాయి.

విహారయాత్రలతో పిల్లలకు ప్రకృతి అందాలు అనుభవించే అద్భుత అరుదైన అవకాశం దొరుకుతుంది. విహారయాత్రలు పిల్లలకు విజ్ఞానయాత్రలుగా కూడా ఉపయోగపడతాయి. జూన్ 3వ వారంలో వాతావరణం కూడా అహ్లాదకరంగా, ఆకర్షణీయంగా విహారయాత్రలకు అనుకూలంగా ఉంటుంది. విహారయాత్రల నిర్వహణ ద్వారా పిల్లలకు, తల్లితండ్రులకు, తాత బామ్మలకు మధ్య చక్కటి ప్రేమానుబంధాలు ఏర్పడతాయి. ఆస్ట్రేలియా లాంటి దేశాల్లో ఆగష్టు మొదటి సోమవారం సెలవు దినంగా 'పిక్నిక్ డే' నిర్వహించుట జరుగుతుంది.

## శారీరక మానసిక ఉపశమన క్షణాలు:

జీవితాలను పరిపూర్ణంగా ఆస్వాదించడానికి, శారీరక మానసిక ఉల్లాసానికి దోహదపడే విహారయాత్రల వంటి అన్ని రకాల కార్యక్రమాలను నిర్వహించుకొనుటకు అందరు ముందుకు రావాలని, యాంత్రిక జీవితంలోంచి బయటపడి అపురూప ఆనంద క్షణాలను అనుభవించే అద్భుత అవకాశాలను జారవిడుచుకోవద్దని మనవి. ధనార్జన మాత్రమే ఆనందాన్ని ఇవ్వదని, ఆనందించలేని జీవితం నిరర్థకమని తెలుసుకుందాం. ఆనందమయ జీవన విధానంతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని తెలుసుకుందాం.

ఆనందమే ఆరోగ్యమని, ఆరోగ్యమే మహాభాగ్యమని నమ్మదాం. కనీసం వానాకాలంలో అయినా వన భోజనాలు, దర్శనీయ క్షేత్రాలకు ప్రణాళికలు వేద్దాం, సాకారం చేసుకుందాం.

– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి,
99497 00037

# రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి జగత్ ప్రకాశ్ నడ్డా, సహాయ మంత్రి అనిప్రియా పటేల్ అధ్యక్షతన ఫార్మాసూటికల్స్ విభాగం సమీక్షా సమావేశం




న్యూఢిల్లీ, జూన్ 17 :కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి జగత్ ప్రకాశ్ నడ్డా, ఆ శాఖ సహాయ మంత్రిసహాయ మంత్రి అనుప్రియ పటేల్ అధ్యక్షతన ఈ రోజు ఫార్మాస్యూటికల్స్ విభాగం సమీక్షా సమావేశం జరిగింది.

ఫార్మా, మెడిటెక్ రంగానికి సంబంధించి పరిస్థితిని వివరంగా ఆ విభాగం అందించింది. రెగ్యులేటరీ ఫ్రేమ్ వర్క్, ఆ విభాగం ద్వారా అమలవుతోన్న పథకాలతో సహా డిపార్ట్ మెంట్ కార్యకలాపాలపై వివరణాత్మక ప్రజంటేషన్ ఇచ్చింది.

ప్రధాన మంత్రి దార్శనికత అయిన వికసిత్ భారత్ ఏ 2047పై దృష్టి సారించాల్సిన అవసరాన్ని మంత్రి నొక్కిచెప్పారు.

పంచవర్ష ప్రణాళిక, 100 రోజుల కార్యాచరణ ప్రణాళికను సమీక్షించారు. ఔషధ భద్రత పెంపు, వైద్య పరికరాల్లో ఆత్మనిర్భరత, జన ఔషధి పథకాన్ని విస్తరించడం ఔషధాలు, చికిత్సలను పౌరులకు అందుబాటు ధరల్లోకి తీసుకురావడంపై పంచవర్ష ప్రణాళిక దృష్టి సారిస్తుంది.

నాణ్యతపై దృష్టి సారించాలని వచ్చే మూడేళ్లలో అన్ని ఔషధాలు, వైద్య పరికరాల తయారీ కేంద్రాలను ప్రపంచ స్థాయి ప్రమాణాలకు అనుగుణంగా అప్ గ్రేడ్‌చేయాలని కేంద్ర మంత్రి ఆదేశించారు.

# గంగానదిలో పడవ బోల్తా పడి ఆరుగురు గల్లంతు

ఉత్తరాఖండ్ జూన్ 17 (ఎక్స్ ప్రెస్ న్యూ స);రాజధాని నగరానికి 70 కిమీ దూరంలో బార్హ్ పట్టణ సమీపంలో ఆదివారం ఉదయం గంగానదిలో పడవ బోల్తా పడి ఆరుగురు గల్లంతయ్యారు. మొత్తం 17 మంది ఈ పడవలో ప్రయాణిస్తుండగా, పడవ బోల్తా పడి అందులోని 11 మంది ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకోగలిగారు. మిగతా ఆరుగురు గల్లంతైనట్టు సమాచారం . ఉమానాథ్ గంగా ఘాట్ సమీపం లో ఉదయం 9.15 గంటలకు ఈ ప్రమాదం జరిగిందని బార్హ్ సబ్‌డివిజనల్ ఆఫీసర్ శుభం కుమార్ తెలిపారు.. జిల్లా యంత్రాంగం, పోలీస్ సిబ్బంది ప్రమాద స్థలానికి వెళ్లి సహాయ కార్యక్రమాలు ప్రారంభించారు. మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించేందుకు నలంద నుంచి పడవలో వచ్చిన వీరు అంత్యక్రియల తరువాత స్నానానికి గంగానది అవతలవైపు పడవలో వెళ్తుండగా ఈప్రమాదం జరిగినట్టు తెలుస్తోంది. మునిగిపోయిన వారిలో ఎన్‌హెచ్‌ఏఐ మాజీ ప్రాంతీయ అధికారి అవధేష్ కుమార్, ఆయన కుమారుడు ఉన్నారు.

# అమర్‌నాథ్ యాత్ర భద్రత, లాజిస్టిక్స్ ఏర్పాట్లపై కేంద్ర హోం, సహకార మంత్రి అమిత్ షా అధ్యక్షతన న్యూఢిల్లీలో ఉన్నత స్థాయి సమావేశం



న్యూఢిల్లీ, జూన్ 17 :అమర్‌నాథ్ యాత్రకు భద్రత, లాజిస్టిక్స్ ఏర్పాట్లను సమీక్షించడానికి కేంద్ర హోం, సహకార మంత్రి అమిత్ షా ఈరోజు న్యూఢిల్లీలో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జాతీయ భద్రతా సలహాదారు అజిత్‌దోవల్, జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, కేంద్ర హోం శాఖ కార్యదర్శి, ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టర్, ఆర్మీ చీఫ్ జనరల్ మనోజ్ పాండేతో సహా సీనియర్ ఆర్మీ అధికారులు, చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ (నియమించిన) లెఫ్టినెంట్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, సీఏపీఎఫ్స డైరెక్టర్ జనరల్ జమ్మూకశ్మీర్ చీఫ్ సెక్రటరీ,డీజీపీ ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

అమర్ నాథ్ యాత్ర విషయంలో భద్రతా సంస్థలు అప్రమత్తంగా ఉండాలని, తగినంత భద్రతా సిబ్బందిని మోహరించేలా చూడాలని మంత్రి ఆదేశించారు. సమర్థవంతమైన భద్రతా ఏర్పాట్ల కోసం సుస్థిరమైన స్టాండర్డ్ ఆపరేటింగ్ రెస్పాన్స్ మెకానిజంతో సహా సంపూర్ణ ఇంటర్ ఏజెన్సీ సమన్వయం కలిగి ఉండాలని ఆయన ఆదేశించారు. భక్తులకు సౌకర్యవంతమైన, అవాంతరాలు లేని అనుభూతిని కల్పించేందుకు ప్రధాని మోదీ సారథ్యంలోని ప్రభుత్వం కట్టుబడి ఉందని అమర్‌నాథ్ యాత్ర నిర్వహణలో పర్యావరణ అనుకూల విధానాలను అవలంభించాలని అమిత్ షా తెలిపారు. అమర్‌నాథ్ యాత్రకు వెళ్లే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పవిత్ర దర్శనం కల్పించడం మోడీ ప్రభుత్వ ప్రాధాన్యతని ఆయన అన్నారు.

కేంద్ర పాలిత ప్రాంతం జమ్మూకశ్మీర్ అమర్‌నాథ్ యాత్రను సురక్షితంగా, భక్తులకు సౌకర్యవంతంగా చేయడానికి గణనీయ కార్యక్రమాలను చేపట్టింది. గతేడాది 4.5 లక్షల మందికి పైగా భక్తులు ఈ పవిత్ర యాత్ర చేపట్టారు. ఈ ఏడాది జూన్ 29న యాత్ర ప్రారంభం కానుంది. రిజిస్ట్రేషన్, వాహనాల కదలిక, క్యాంపింగ్ సౌకర్యాలు, వైద్య సదుపాయాలు, ట్రాక్‌లను అప్‌గ్రేడ్ చేయడం.. విద్యుత్, నీటి సరఫరా, మొబైల్ ఫోన్ కనెక్టివిటీతో పాటు యాత్రను సజావుగా నిర్వహించడానికి జమ్ముకశ్మీర్ పరిపాలనా యంత్రాంగం విస్తృతమైన ఏర్పాట్లు చేసింది.

# జపాన్‌లో జరిగే సకురా సైన్స్ ప్రోగ్రాం 2024లో పాల్గొనున్న 21 మంది విద్యార్థులు



న్యూఢిల్లీ, జూన్ 17 :జపాన్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఏజెన్సీ (జేఎస్‌టి) ఆహ్వానం మేరకు భారత్ నుండి సకురా సైన్స్ ప్రోగ్రాం–2024కి వెళ్లే 21 మంది విద్యార్థుల బృందానికి పాఠశాల విద్యా మంత్రిత్వ శాఖ లోని పాఠశాల విద్య మరియు అక్షరాస్యత విభాగం (డోసెల్) సంయుక్త కార్యదర్శి శ్రీమతి అర్చన శర్మ అవస్థి ఘనంగా వీడ్కోలు పలికారు. సీఐఈటి–ఎన్ సి ఈ ఆర్ టి నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎన్ సి ఈ ఆర్ టి డైరెక్టర్ ప్రొఫెసర్ దినేష్ ప్రసాద్ సక్లాని పాల్గొన్నారు. అటు జేఎస్టి జపాన్ మేనేజర్ కెమోచి యుకియో, సీఐఈటి–ఎన్ సి ఈ ఆర్ టి జాయింట్ డైరెక్టర్ అమరేంద్ర ప్రసాద్ బెహెరా, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ 21 మంది విద్యార్థులు భారత్ నుండి, మరి కొంత మంది విద్యార్థులు ఇతర దేశాల నుండి కూడా జూన్ 16 నుండి 22 వరకు జరిగే సకురా సైన్స్ ప్రోగ్రాంలో భాగస్వాములు అవుతున్నారు.

యువ అభ్యాసకులలో మేధోపరమైన శిఖరాలను అధిరోహించేలా, శాస్త్రీయ అన్వేషణను అభివృద్ధి చేయడానికి, జపాన్ అత్యాధునిక సైన్స్ మరియు టెక్నాలజీతో పాటు దాని సంస్కృతిని అధ్యయనం చేయడానికి డోసెల్ తో కూడిన జే ఎస్ టి సకురా సైన్స్ హై స్కూల్ ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. 2014 నుండి సాకురా సైన్స్ ప్రోగ్రామ్ (ఎస్‌ఎస్పి) కింద జపాన్‌కు స్వల్పకాలిక సందర్శనల కోసం ప్రోగ్రామ్ కింద విద్యార్థులను ఆహ్వానించారు, జపాన్ అత్యాధునిక సైన్స్ మరియు టెక్నాలజీని అలాగే దాని సంస్కృతిని తెలుసు కోడానికి వారికి అవకాశం కల్పిస్తున్నారు.

ఏప్రిల్ 2016లో భారతదేశం మొదటిసారిగా ఈ కార్యక్రమంలో పాల్గొంది. ఈ కార్యక్రమం కింద ఇప్పటివరకు 532 మంది విద్యార్థులు, 83 మంది సూపర్‌వైజర్లు జపాన్‌ను సందర్శించారు. చివరి బ్యాచ్ డిసెంబర్ 2023లో జపాన్‌ను సందర్శించింది.

ప్రస్తుత బ్యాచ్‌లోని ఈ 21 మంది విద్యార్థులు (6 మంది బాలురు మరియు 15 మంది బాలికలు) దేశవ్యాప్తంగా 6 రాష్ట్రాల (ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తరాఖండ్మ, ఉత్తరప్రదేశ్) కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు, నేతాజీ సుభాష్ చంద్రబోస్ రెసిడెన్షియల్ పాఠశాలలు, కేంద్రీయ విద్యాలయాలకు చెందినవారు.

జాతీయ విద్యా విధానం (ఎన్‌ఈపి) 2020, పాఠశాలల్లో పాఠ్యాంశాలు, బోధనా శాస్త్రం ప్రాముఖ్యతను నొక్కి చెబుతూ, "అభ్యాసం సంపూర్ణంగా, సమగ్రంగా, ఆనందించదగినదిగా, దానిలోనే నిమగ్నమై ఉండాలి" అని స్పష్టం చేస్తుంది. అలాగే, ఎన్‌ఈపి 2020 ప్రకారం, అన్ని దశల్లో, ప్రతి సబ్జెక్ట్‌లో, వివిధ సబ్జెక్టుల మధ్య సంబంధాల అన్వేషణలతో అనుభవపూర్వక అభ్యాసం ప్రామాణిక బోధనగా అవలంబిస్తున్నారు. ఈ నేపథ్యంలో చారిత్రక, సాంస్కృతిక, సామాజిక, సాంకేతిక వికాసానికి సంబంధించి వివిధ ప్రాధాన్యమున్న ప్రదేశాలకు విద్యా యాత్రలు, విహార యాత్రలు అత్యంత ప్రాధాన్య తను సంతరించుకున్నాయి. జపాన్ అభివృద్ధి చెందిన దేశం, స్నేహపూర్వక దేశం. దాని సాంకేతిక పురోగతుల కారణంగా, ఇది ఎడ్యుకేషనల్ ఎక్స్‌పోజర్‌కి కూడా ఇష్టమైన గమ్యస్థానంగా ఉంది. జపాన్ వంటి దేశాన్ని సందర్శించడం ఎల్లప్పుడూ సుసంపన్నమైన అనుభవాన్ని, దాని వినూత్న పద్ధతులను అన్వేషించడానికి అవకాశాన్ని అందిస్తుంది.

VURIMALLA FOUNDATION REGD. NO 228 OF 2019

వురిమళ్ల ఫౌండేషన్ - అక్షరాల తోవ సంయుక్త ఆధ్వర్యంలో....

జాతీయ స్థాయి కథలు, కవితల పోటీలు – 2024

'వురిమళ్ల శ్రీరాములు' స్మారక కథల పోటీలు :
- కథ చేతిరాతలో 5 పేజీలకు మించరాదు. డి.టి.పి. చేసినచో 3 పేజీలకు మించరాదు.
- అంశం : ఏదైనా సామాజికాంశం
- హామీపత్రం విడిగా రాసి, జతచేయాలి.

నిబంధనలు :

'వురిమళ్ల పద్మజ' స్మారక కవితల పోటీలు :
- కవిత 25 లైన్లకు మించరాదు.
- అంశం : ఏదైనా సామాజికాంశం
- హామీపత్రం విడిగా రాసి, జతచేయాలి.

2024 సంవత్సరానికి గాను "వురిమళ్ల ఫౌండేషన్ - అక్షరాల తోవ" సంయుక్త నిర్వహణలో జాతీయస్థాయి కథలు, కవితలు పోటీలు నిర్వహించనున్నారు.

'వురిమళ్ల శ్రీరాములు' స్మారక కథల పోటీలలో ప్రథమ బహుమతి రూ. 5000/-, ద్వితీయ బహుమతి రూ. 4000/-, తృతీయ బహుమతి రూ. 3000/- లతో పాటు రెండు కన్సలేషన్ బహుమతులు 1000/- ల చొప్పన విజేతలకు ఇవ్వబడును.

'వురిమళ్ల పద్మజ' స్మారక కవితల పోటీలలో ప్రథమ బహుమతి రూ. 4000/-, ద్వితీయ బహుమతి రూ. 3000/-, తృతీయ బహుమతి రూ. 2000/- లతో పాటు రెండు కన్సలేషన్ బహుమతులు 1000/- ల చొప్పన విజేతలకు ఇవ్వబడును.

వీటితో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సాహిత్యంలో విశేష కృషి చేస్తున్న వారిలో ఒకరికి "భోగోజు పురుషోత్తం-సముద్రమ్మ" గార్ల సాహితీ పురస్కారంతో పాటు రూ. 10,000/- నగదు బహుమతి అందజేయబడుతుంది.

కవితలు, కథలు పంపాల్సిన చివరి తేది : 30 జూన్ 2024

కథలు, కవితలు పంపాల్సిన చిరునామా :
రాచమళ్ళ ఉపేందర్, స్టార్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్, శాంతి లాడ్జి ఎదురుగా, స్టేషన్‌రోడ్, ఖమ్మం - 507001. సెల్ : 98492 77968

పూర్తి వివరాలకు : వురిమళ్ల పౌండేషన్ వ్యవస్థాపకురాలు : వురిమళ్ల సునంద, సెల్ : 9441815722

# సముద్ర గర్భ శోధనకు సంబంధించి సొంతంగా డీప్ సీ మిషన్ ను చేపట్టిన దేశాల్లో భారత్ 6వ ది- వెల్లడించిన డాక్టర్ జితేంద్ర సింగ్

న్యూఢిల్లీ, జూన్ 17 :"భారతదేశం తన స్వంత డీప్ సీ మిషన్‌ను కలిగి ఉన్న 6వ దేశంగా అవతరిస్తుంది" అని కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ,ఎర్త్ సైన్సెస్ శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత), పీఎంఓ, అణు విద్యుత్, అంతరిక్షం, సిబ్బంది, ప్రజా సమస్యలు, పెన్షన్లు శాఖల సహాయ మంత్రి డిపార్ట్‌మెంట్ డాక్టర్ జితేంద్ర సింగ్ శనివారం కొత్త దిల్లీలో చెప్పారు.

మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్ 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక గురించి చర్చించడానికి జరిగిన సమావేశానికి అధ్యక్షత వహించిన డాక్టర్ జితేంద్ర సింగ్ డీప్ సీ మిషన్ పురోగతిపై సంతోషాన్ని వ్యక్తీకరించారు. ఈ ఘనతను సాధించిన అతి కొద్ది దేశాలలో భారతదేశం కూడా ఉంది. సముద్రం, జీవనోపాధి కోసం దాని శక్తిపై ఆధారపడిన ప్రజలను శక్తివంతం చేయడానికి ఒక స్థితిస్థాపకమైన నీలి-ఆర్థిక వ్యవస్థను సాధించడంపై దృష్టి పెట్టాలని ఆయన ఇన్‌స్టిట్యూట్‌లను కోరారు. లోతైన సముద్ర మిషన్ ఆకృతులను గీయడంపై మాట్లాడుతూ "మిషన్, ఖనిజ అన్వేషణకు మాత్రమే పరిమితం కాదు, సముద్ర శాస్త్రాల అభివృద్ధి, వృక్షజాలం, జంతుజాలం అన్వేషణ, సముద్ర జీవవైవిధ్య పరిరక్షణ మొదలైనవి కూడా ఉన్నాయి" అని అన్నారు.

సముద్రంలో 6000 మీటర్ల లోతుకు వెళ్లగల మత్స్యయాన్ 6000 అభివృద్ధి కోసం నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ (ఎన్‌ఐఓటి) కృషిని కేంద్ర మంత్రి ప్రశంసించారు. పురోగతిని సమీక్షిస్తూ, హార్బర్ ట్రయల్ 1వ దశను సెప్టెంబర్ 2024 నాటికి పూర్తి చేయాలని, తదుపరి ట్రయల్స్‌ను 2026 నాటికి పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.

'టైటానియం హల్' ను అభివృద్ధి చేయడం ద్వారా తీవ్ర ఒత్తిడిని విజయవంతంగా భరించేందుకు భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)తో కలిసి పని చేస్తున్నందుకు డాక్టర్ జితేంద్ర సింగ్ వారిని అభినందించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కోవటానికి, 72 గంటల పాటు నీటిలో మునిగిపోయేలా 'సెల్ఫ్–ఫ్లోటేషన్' టెక్నాలజీ అభివృద్ధిపై కూడా ఆయన ఆరా తీశారు. యాన్ 4 గంటల అవరోహణలో పురోగతి కొన్ని ముఖ్యాంశాలు.

"డీప్ సీ మిషన్ భారత ఆర్థిక వ్యవస్థ సర్వతోముఖాభివృద్ధికి గొప్పగా దోహదపడే సామర్థ్యాన్ని కలిగి ఉంది" అని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. ఈ మిషన్ వృక్షజాలం, జంతుజాలం, లోతైన సముద్ర అన్వేషణ, అరుదైన భూమి లోహాల వాణిజ్య దోపిడీ, అన్వేషణపై అనేక రెట్లు ప్రభావాన్ని ప్రముఖంగా ప్రస్తావించారు. భారతీయ సముద్రపు అడుగుభాగంలో లోహాలు, పాలీ మెటాలిక్ నోడ్యూల్స్ ఆవిష్కరణ జరగాలన్నారు. స్వదేశీ సాంకేతికత, సామర్థ్యాన్ని అభివృద్ధి చేయడానికి, భారతదేశం ఆధారపడటాన్ని తగ్గించడానికి శాస్త్రవేత్తలు, అధికారులస్పష్టం చేస్తూ ప్రేరణాత్మక ప్రసంగం చేశారు.

సమావేశంలో ఎర్త్ సైన్సెస్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి డాక్టర్ ఎం రవి చంద్రన్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ల్యాప్‌టాప్ ఒడిలో పెట్టుకుని పనిచేసుకుంటున్నారా.. అయితే జర జాగ్రత్త!

హైదరాబాద్ జూన్ 17 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ల్యాప్‌టాప్స్ ఇప్పుడు మన జీవితాల్లో విడదీయరాని భాగమైపోయాయి. ల్యాప్‌టాప్ అంటారు కాబట్టి, దీన్ని చాలామంది ఒడిలో పెట్టుకుని హాయిగా పనిచేసుకంటూ ఉంటారు. కానీ ఇలా చేయడం వల్ల తీవ్రమైన దుష్ప్రభావాలు ఉంటాయట. ముఖ్యంగా పురుషుల విషయంలో ల్యాప్‌టాప్ ఒడిలో పెట్టుకోవడం వల్ల వృషణాల ఉష్ణోగ్రత పెరుగుతుంది. అంతేకాకుండా వృషణాలు ఎలెక్ట్రోమ్యాగ్నెటిక్ రేడియేషన్‌కు గురవుతాయి. ఉష్ణోగ్రత పెరుగుదల పురుషుల్లో వీర్య కణాల సంఖ్య, నాణ్యత మీద ప్రతికూల ప్రభావం చూపుతుంది. మిగతా శరీర భాగాలతో పోలిస్తే వృషణాల దగ్గర ఉష్ణోగ్రత రెండు మూడు డిగ్రీలు తక్కువగా ఉంటుంది. ఇందులో ఏ మాత్రం పెరుగుదల కని పించినా అది పురుష ప్రత్యుత్పత్తి వ్యవ స్థ మీద ప్రభావం చూపుతుంది. ఈ విషయంలో ఇంకా పరిశోధనలు జరు గుతున్నాయి. అయినప్పటికీ? ల్యాప్ టాపలను డెస్క్‌లపైనో, టేబుల్‌పైనో పెట్టి పనిచేసుకుంటే మంచిదని నిపుణుల సలహా.

# రాజన్న సన్నిధిలో నూతన కలెక్టర్ ప్రత్యేక పూజలు



రాజన్న సిరిసిల్ల, జూన్ 17 :(నేటినిజం ప్రతినిధి): సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని నూతనంగా విధులు చేపట్టిన కలెక్టర్ సందీప్ కుమార్ జా ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్గా విధులు నిర్వహిస్తూ అనురాగ్ జయంతి బదిలీపై కరీంనగర్ వెళ్లారు. ఆయన స్థానంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గా సందీప్ కుమార్ జా బాధ్యతలు చేపట్టారు.

ఈ సందర్భంగా రాజరాజేశ్వర స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అంతకుముందు ఆలయ అర్చకులు, అధికారులు నూతన కలెక్టర్ కు పూర్ణకుంభ స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం నూతన కలెక్టర్ మాట్లాడుతూ రాజరాజేశ్వర స్వామి క్షేత్రం ఉన్న రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రజలకు స్వామివారికి సేవలందించే భాగ్యం కల్పించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు.

అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్,గౌతమి, ఆలయ ఇన్చార్జి ఈఓ రామకృష్ణ, మున్సిపల్ కమిషనర్ అన్వేష్ లతోపాటు వివిధ శాఖల అధికారులు సిబ్బంది నూతన కలెక్టర్ ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు అనంతరం ఆలయ అర్చక బృందం ఆశీర్వచనం కావించి స్వామివారి చిత్రపటం మహా ప్రసాదం అందజేసి సత్కరించారు.

# పిఎం కిసాన్ పథకం కింద నేడు వారణాసిలో 17వ విడత సొమ్ము

## రూ.20 వేల కోట్లను విడుదల చేయనున్న ప్రధాని

న్యూఢిల్లీ, జూన్ 17 :పిఎం కిసాన్ పథకం కింద ఈ నెల 18న వారణాసిలో 17వ విడత సొమ్ము రూ.20 వేల కోట్లను ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ విడుదల చేయనున్నారని కేంద్ర వ్యవసాయశాఖ, రైతు సంక్షేమం, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. న్యూఢిల్లీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలందించారు. జూన్ 18న ప్రధాని వారణాసిలో పర్యటిస్తారని పీఎం కిసాన్ పథకం కింద 17 వ విడత ఆర్థిక సహాయం రూ.20 వేల కోట్లను విడుదల చేస్తారని కేంద్రమంత్రి వివరించారు. అంతే కాదు ఈ సందర్భంగా 30 వేల స్వయం సహాయక బృందాలకు కృషి సఖి సర్టిఫికెట్లను అందజేయనున్నారు. ఈ కార్యక్రమాన్నిఉత్తరప్రదేశ్‌రాష్ట్రంతో సమన్వయం చేసుకుంటూ కేంద్ర వ్యవసాయశాఖ నిర్వహిస్తోందని కేందమంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్తరప్రదేశ్ గవర్నర్, కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్, ఉత్తరప్రదేశ్ సీఎం శ్రీ యోగి ఆదిత్యనాథ్‌తోపాటు పలువురు యూపీ మంత్రులు పాల్గొనబోతున్నారు.

కీలకమైన వ్యవసాయశాఖను తనకు అప్పగించినందుకు ప్రధాని శ్రీ నరేంద్ర మోదీకి, కేంద్ర మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ కృతజ్ఞతలు తెలియజేశారు. దేశ అభివృద్ధిలో కీలకమైన వ్యవసాయశాఖను నిర్వహించే గురుతరమైన బాధ్యత లభించినందుకు ఆయన సంతోషం వ్యక్తం చేశారు. భారతదేశ ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయం పునాదిగా నిలుస్తోందని అన్నారు. ఇప్పటికీ ఉపాధి అవకాశాలను ఎక్కువగా అందిస్తున్న రంగం వ్యవసాయమే అని కేంద్ర మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు.

దేశవ్యాప్తంగా గల లక్షలాది ఆహారధాన్యాల గోదాములను దేశ రైతులే నింపుతున్నారని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి అన్నారు. వ్యవసాయానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి ప్రధాని మోదీ పాలన కొనసాగుతోందని రైతుల సంక్షేమం కోసం గతంలో అనేక చర్యలు తీసుకున్నామని కేంద్ర మంత్రి అన్నారు. తాజాగా కూడా తమ ప్రభుత్వం రైతులకే ప్రాధాన్యత ఇస్తోందని ప్రధాని మొదటి సంతకం రైతులకు 17 విడత కిసాన్ సమ్మాన్ నిధులను విడుదల చేసే ఫైలుపైనే అని కేంద్ర మంత్రి అన్నారు. మూడోసారి ప్రధాని అయిన తర్వాత అందరూ ఎంతగానో ఎదురు చూస్తున్న 17వ విడత కిసాన్ సమ్మాన్ నిధుల విడుదల ద్వారా రూ.20 వేల కోట్లను రైతులకు పంపిణీ చేయడం జరుగుతోంది. వారణాసిలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో బటన్ నొక్కడంద్వారా నిధుల పంపిణీ మొదలవుతుంది.

కేంద్రప్రభుత్వం రూపొందించిన కిసాన్ సమ్మాన్ నిధిని 2019 ఫిబ్రవరిలో ఏర్పాటు చేయడం జరిగింది. వ్యవసాయ భూమి కలిగిన రైతులందరికీ షరతుల ప్రకారం ఆర్థిక సాయం చేయడం జరుగుతోంది. ఈ పథకం కింద లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరుగుతుందని ఇంతవరకూ ఈ పథకం కింద 3.04 లక్షల కోట్ల రూపాయలను 11 కోట్ల మంది రైతులకు పంపిణీ చేయడం జరిగిందని శ్రీ శివరాజ్ సింగ్ వివరించారు. తాజాగా చేయబోయే చెల్లింపులతో ఈ మొత్తం రూ.3.24 లక్షల కోట్లకు చేరుకుంటుందని అన్నారు.

రైతుల సౌభాగ్యాన్ని కోరుకుంటూ దేశాభివృద్ధికోసం చేసిన తీర్మాన విజయమనేది ఈ నెల 18న వారణాసిలో మొదలవుతున్నదని కేంద్ర మంత్రి తెలిపారు. ఎందుకంటే ఇదే రోజున పలువురు కేంద్ర మంత్రులు దేశవ్యాప్తంగా వున్న 50 కృషి విజ్ఞాన కేంద్రాలను సందర్శించి అక్కడ రైతులతో సంభాషిస్తారని కేంద్ర మంత్రి వివరించారు. వ్యవసాయశాఖకు సంబంధించిన వివిధ పథకాలపై రైతుల్లో అవగాహన పెంచుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా దాదాపు రెండున్నర కోట్ల మంది రైతులు పాల్గొంటారని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా వున్న 732 కృషి విజ్ఞాన కేంద్రాలు, ఒక లక్షకుపైగాగల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, ఐదు లక్షలకుపైగాగల ఉమ్మడి సేవా కేంద్రాలు పాల్గొంటాయని కేంద్ర మంత్రి వివరించారు. తద్వారా రైతుల్లో తగిన చైతన్యాన్ని నింపడం జరుగుతుందని అన్నారు.

మూడుకోట్ల మంది అక్కచెల్లెమ్మలను లక్షాధికారులను చేయాలని ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ కృతనిశ్చయంతో వున్నారని వారిలో ఒక లక్షలమందిని ఇప్పటికే లక్షాధికారులను చేశారని శ్రీ శివరాజ్ సింగ్ అన్నారు. ఇంకా 2 రెండు కోట్ల మందిని లక్షాధికారులను చేయాల్సి వుంది. దానికి సంబంధించినదే కృషి సఖి అనే కార్యక్రమం అని ఆయన అన్నారు. దేశంలో అన్నదాతలకు సాయం చేయడంకోసం స్వయం సహాయక బృందాల మహిళలకు శిక్షణ ఇచ్చామని ఆయన స్పష్టం చేశారు. ఈ పని చేయడం ద్వారా వారు ప్రతి ఏడాది అదనంగా 60నుంచి 80వేల రూపాయలు సంపాదించుకుంటారని ఆయన అన్నారు. పిఎం కిసాన్ నిధులను విడుదల చేస్తున్న సందర్భంగా ప్రధాని చేతుల మీదుగా కృషి సఖి సర్టిఫికెట్ల పంపిణీ కూడా జరుగుతుందని అన్నారు. కృషి సఖి కార్యక్రమాన్ని మొదటి దశలో 12 రాష్ట్రాల్లో అమలు చేయబోతున్నామని అన్నారు. అవి 1. గుజరాత్ 2. తమిళనాడు 3. ఉత్తర్ ప్రదేశ్ 4. మధ్యప్రదేశ్ 5. చత్తీస్ ఘడ్ 6. కర్నాటక 7. మహారాష్ట్ర 8. రాజస్థాన్ 9. ఒడిషా 10. జార్ఖండ్ 11. ఆంధ్రప్రదేశ్ 12. మేఘాలయ.

కృషి సఖీలకు విస్తృత స్థాయిలో శిక్షణ ఇవ్వడం జరిగిందని కేంద్రమంత్రి తెలిపారు. తద్వారా వారు తమ తమ ప్రాంతాల్లోని రైతులకు సహాయకారులుగా వుంటారని ఆయన అన్నారు. రైతులకు ఆర్థిక సాయం చేయడం కోసం పిఎం కిసాన్ పథకం కింద ప్రతి ఏడాది 6 వేల రూపాయలను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేయడం జరుగుతోందని , ఆ డబ్బును మూడు వాయిదాల్లో ప్రతి నాలుగు నెలలకు ఒకసారి చెల్లించడం జరుగుతోందని అన్నారు. అలాగే ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద 4 కోట్ల మందికిపైగా రైతులకు ఆర్థిక భద్రత చేకూర్చడం జరుగుతోందని తెలిపారు. అంతర్జాతీయంగా ధరలు పెరిగినప్పటికీ రైతులను దృష్టిలో పెట్టుకొని తక్కువ ధరల్లోనే ఎరువులను అందిస్తున్నామని ఇందుకోసం రూ. 11 లక్షల కోట్ల రాయితీ కార్యక్రమం కొనసాగుతుందని అన్నారు.

పిఎం కిసాన్ కార్యక్రమాన్ని డీడీ ఛానెళ్లతోపాటు వివిధ సామాజిక వాద.్యవాల ద్వారా ప్రసారమవుతుందని దేశవ్యాప్తంగా వున్న 5 లక్షలకు పైగా ఉమ్మడి సేవా కేంద్రాల్లో చూడవచ్చని రైతులకు కేంద్రమంత్రి తెలిపారు.

మీడియా సమావేశంలో వ్యవసాయశాఖ కార్యదర్శి శ్రీ మనోజ్ అహుజాతోపాటు డేర్ కార్యదర్శి శ్రీ హిమాన్షు పాఠక్ కూడా పాల్గొన్నారు.

# హెల్త్ మినిస్టర్ ఫీల్డ్ వర్క్ షురూ .. రుయా హాస్పిటల్లో ఆకస్మిక తనిఖీలు

తిరుపతి, జూన్ 17 : తిరుపతి లోని రుయా ఆస్పత్రిలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ ఆకస్మిక తనిఖీ చేశారు. హాస్పిటల్ సిబ్బంది పని తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైద్య ఆరోగ్యశాఖను అనారోగ్య శాఖగా మార్చివేశారని ఆయన విమర్శించారు. అన్ని రకాలుగా కేంద్ర ప్రభుత్వాన్ని, నిధులను గత ప్రభుత్వం దుర్వినియోగం చేసిందని ఆయన ఆరోపించారు. భవిష్యత్తులో నిరంతరంగా రెగ్యులర్ తనిఖీలు ఉంటాయన్నారు. గత ప్రభుత్వం చేసిన నిర్వాకంతో సామాన్యులకు వైద్య సేవలు అందని పరిస్థితి ఏర్పడిందన్నారు.

సీఎం చంద్రబాబు నేతృత్వంలో కేంద్రం నుంచి నిధులు రాష్ట్రం నుంచి సమన్వయ నిధులు కలిపి ఆసుపత్రులను అభివృద్ధి చేస్తామన్నారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరికి క్యాన్సర్ స్క్రీనింగ్ చేయడానికి ఒక కార్యక్రమం ప్రారంభిస్తున్నామన్నారు. త్వరలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఈ కార్యక్రమం ప్రారంభమవు తుందన్నారు. గత పాలకులు రిషికొండలో విలాసవంత భవనాలు తాడేపల్లిలో ప్రభుత్వ వ్యయంతో రహదారుల నిర్మాణాలు చేసుకొని విలాసవంతమైన జీవితం అనుభవించారని విమర్శించారు. మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి రేణిగుంట నుంచి తిరుపతి రావడానికి కూడా ప్రత్యేకంగా హెలికాప్టర్‌ను వాడారన్నారు. అంటే ప్రభుత్వ ధనాన్ని ఎంత దుర్వినియోగం చేశారో అర్థమవుతుందన్నారు.

# పోలవరంలో చంద్రబాబు- ప్రాజెక్ట్ ను పరిశీలించిన సిఎం..




అమరావతి, జూన్ 17 :ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పోలవరంలో పర్యటిస్తున్నారు.. అనుకున్నట్టుగానే ఉదయం 11 గంటలకు విజయవాడ నుంచి పోలవరం చేరుకున్నారు. అక్కడ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఇరిగేషన్ శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, అధికారులు, టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు స్వాగతం పలికారు. హెలికాప్టర్‌లో అక్కడకు చేరుకున్న చంద్రబాబు నేరుగా పోలవరం సందర్శించారు. ముందుగా ఆయన హెలికాప్టర్ ద్వారా పోలవరం నిర్మాణాలను ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలించారు..

అనంతరం అనంతరం ప్రాజెక్టు వద్దకు చేరుకుని అధికారులతో మాట్లాడారు. స్పిల్‌వే, కాఫర్ డ్యామ్, డయాఫ్రమ్ వాల్ పనుల పురోగతిపై జలవనరుల శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత వారితో కలిసి బస్సులో ప్రాజెక్టు పరిసరాలను పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శనను తిలకించారు. గతంలో ఎడమగట్టు వద్ద కుంగిన గైడ్‌బండ్ ప్రాంతాన్ని పరిశీలించి అధికారులతో మాట్లాడారు. 22, 23 గేట్ల నుంచి ప్రాజెక్టు పరిసరాలను చూశారు.

ఇతి మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు ప్రాజెక్టు పురోగతిపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. సాయంత్రం 4 గంటలకు పోలవరం నుంచి ఉండవల్లికి తిరిగి రానున్నారు.

# తప్పుచేస్తే తాట తీస్తాం.. ఇకపై ఎవరినీ వదిలే ప్రసక్తి లేదు-హోం మంత్రి వంగలపూడి అనిత

-జగన్‌పై ప్రేమ ఉంటే జాబ్ వదిలేసి వెళ్లండి
-లా అండ్ ఆర్డర్ విషయంలో సీరియస్‌గా ఉండాలి
-సింహాచలం భూములు అన్యాక్రాంతం కానివ్వం
-పంచగ్రామాల భూ సమస్యకు త్వరలో పరిష్కారం
-మీడియాతో ఏపీ హోం మంత్రి వంగలపూడి అనిత

అమరావతి, జూన్ 17 : విశాఖ ప్రతినిధి: లా అండ్ ఆర్డర్ విషయంలో ఎవరు తప్పుచేసినా వదిలే ప్రసక్తే లేదని ఏపీ హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత హెచ్చరించారు. విశాఖపట్నంలో



సోమవారం మీడియాతో మాట్లాడారు. ఇప్పటికీ కొంత మంది పోలీసు అధికారులు తమలో వైఎస్సార్? కాంగ్రెస్ పార్టీ రక్తం ప్రవహిస్తున్నట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. మీకు ఇంకా జగన్ మోహన్ రెడ్డిపై ప్రేమ ఉంటే, ఉద్యోగానికి రాజీనామా చేసి ఆ పార్టీకోసం పనిచేసుకోవాలని సలహా ఇచ్చారు. కానీ, లా అండ్ ఆర్డర్ విషయంలో ఎవరు తప్పుచేసినా వదిలే ప్రసక్తే లేదని వార్నింగ్ ఇచ్చారు.

**సింహాచలం భూములు అన్యాక్రాంతం కానివ్వం..**

సింహాచలం దేవస్థానం భూములు ఒక్క గజం కూడా అన్యాక్రాంతం కావడానికి వీలు లేదని హోం మంత్రి అనిత అన్నారు. పంచగ్రామాల భూ సమస్యకు త్వరలో పరిష్కారం లభిస్తుందని వెల్లడించారు. కాగా, ఏపీ వంగలపూడి అనితతన సొంత జిల్లాలో సోమవారం పర్యటించారు. జిల్లాలోపి టీడీపీ, జనసేన పార్టీల నేతల్ని వరుసగా కలుస్తూ.. అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఇక, నిన్న (ఆదివారం) అనకాపల్లిలో మాజీ మంత్రి, జనసేన ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణని మర్యాదపూర్వకంగా కలిసిన ఆమె ఈ సందర్భంలో కొణతాల రామకృష్ణ కాళ్లకు మొక్కారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

# అడ్మిషను రద్దు చేసుకుంటే వారికి పూర్తి ఫీజును వాపసు

న్యూఢిల్లీ, జూన్ 17 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: విద్యార్థులు నిర్ణీత గడువులోగా ఉన్నత విద్యాసంస్థల్లో తమ అడ్మిషను రద్దు చేసుకుంటే వారికి పూర్తి ఫీజును వాపసు ఇవ్వాలని విశ్వవిద్యాలయాలను యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) ఆదేశించింది. అడ్మిషన్ల చివరి తేదీకి 15 రోజులు, అంత కన్నా ముందే అడ్మిషన్‌ను రద్దు చేసుకుంటే 100 శాతం ఫీజు రిఫండ్ ఇచ్చేలా కొత్త నిబంధనలు జారీ చేసింది. 2024-25 విద్యాసంవత్సరం నుంచే ఈ కొత్త ఫీజు రిఫండ్ పాలసీని అమలు చేయాలని వర్సిటీలను ఆదేశించింది.

# భారత్ ఈవీఎంలను హ్యాక్ చేయడం అసలు సాధ్యం కాదు

-ఈవీఎంల పై ఎలాన్ మస్క్‌కి ట్రైనింగ్ ఇస్తాం
- కేంద్ర మాజీ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్

న్యూ డిల్లీ జూన్ 17 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ల వినియోగంపై బిలియనీర్, వ్యాపారవేత్త ఎలాన్ మస్క్ చేసిన వ్యాఖ్యలపై కేంద్ర మాజీ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ స్పందించారు. ఈ క్రమంలో మస్క్ ఆలోచన విధానం అమెరికా సహా ఇతర ప్రాంతాల్లో అమలు చేయవచ్చు. కానీ భారతదేశంలో ఈవీఎంలను మాత్రం హ్యాక్ చేయడం అసలు సాధ్యం కాదన్నారు.అమెరికాలో ఇంటర్నెట్ ఆధారంగా ఓటింగ్ మిషన్లు) పనిచేస్తాయని, ఇండియాలో మాత్రం వీటిని బ్లూటూత్, వైఫై, ఇంటర్నెట్ వంటి ఏ మార్గాల ద్వారా కనెక్ట్ చేయడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. ఆ క్రమంలో ఈవీఎంలను రీప్రోగ్రామ్ చేయడం సాధ్యం కాదని వెల్లడించారు. ఈ విషయంలో అవసరమైతే ఎలాన్ మస్క్‌కి ట్రైనింగ్ కూడా ఇస్తామని, వీటిని మీ దేశంలో కూడా తయారు చేయవచ్చని చంద్రశేఖర్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు.

# నారాయణ్ సేవా సంస్థాన్ సేవా నిరతి ప్రశంశనీయం

– కొనియాడిన లోక్‌సభ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి
–సేవా సంస్థాన్ శిబిరంలో 600 మంది వికలాంగులకు కృత్రిమ అవయవాలు అందజేత




హైదరాబాద్, జూన్ 17 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );హైదరాబాద్‌లోని కింగ్ కోటిలోని ఈడెన్ గార్డెన్‌లో నారాయణ్ సేవా సంస్థాన్ ఆధ్వర్యంలో నారాయణ్ లింబ్ అండ్ కాలిపర్స్ ఫిట్‌మెంట్ క్యాంపు ఘనంగా నిర్వహించారు. ఈ శిబిరంలో తెలంగాణకు చెందిన 600 మందికి పైగా వికలాంగులకు 800 ఎగువ మరియు దిగువ అవయవాలు మరియు కాలిపర్‌లను అమర్చడం ద్వారా వారి జీవన నాణ్యతను గణనీయంగా మెరుగుపరచడం ద్వారా సహాయం అందించబడింది. లబ్ధిదారులు మరియు వారి కుటుంబ సభ్యుల ఆనందం మరియు కృతజ్ఞతలు లోతుగా కదిలాయి. ఈ శిబిరాన్ని లోక్‌సభ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రాజ్యసభ ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, సామాజిక కార్యకర్తలు మాధవి లత, గౌరీశంకర్, కమల్ నారాయణ్ రాతి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పలువురు దాతలు, వికలాంగులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా రాజస్థాన్‌కు చెందిన కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలోని వికలాంగులకు సహాయం చేసేందుకు సంస్థాన్ అంకితభావంతో ఉన్నారని కొనియాడారు. ప్రత్యేక అతిథి మాధవి లత సంస్థాన్ ప్రెసిడెంట్ ప్రశాంత్ అగర్వాల్ మరియు డైరెక్టర్లు వందనా అగర్వాల్ మరియు పాలక్ అగర్వాల్ వారి గొప్ప ప్రయత్నాలకు కృతజ్ఞతలు తెలియజేశారు మరియు వారికి తన మద్దతు కొనసాగుతుందని హామీ ఇచ్చారు. శిబిరానికి ఎంపీ వీ అనిల్‌కుమార్ యాదవ్ అధ్యక్షత వహించి లబ్ధిదారుల ఆనందాన్ని చూసి హర్షం వ్యక్తం చేశారు. సంస్థాన్ అధ్యక్షుడు ప్రశాంత్ అగర్వాల్ ఎంపీలు రెడ్డి మరియు యాదవ్, సామాజిక కార్యకర్త మాధవి లత మరియు అతిథులు మల్లికార్జున్ రావు, జస్మత్ భాయ్, అల్కా చౌదరి, ఉత్తమ్ దమ్రానీ మరియు రీదీష్ జాగీర్దార్‌లతో సహా ప్రముఖులకు సాంప్రదాయ మేవారీ ఫ్యాషన్‌లో స్వాగతం పలికారు. అతను సంస్థాన్ యొక్క 39 సంవత్సరాల సేవ యొక్క అవలోకనాన్ని అందించాడు మరియు తరువాతి ఐదు సంవత్సరాల కోసం దాని దృష్టిని వివరించాడు. ఫిబ్రవరి 4వ తేదీ క్యాంపు తర్వాత హైదరాబాద్‌లో రెండోసారి నిర్వహిస్తున్న ఈ శిబిరం వారి స్వగ్రామానికి సమీపంలో ఉన్న వికలాంగులకు ప్రయోజనం చేకూర్చడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రమాదాల కారణంగా 600 మందికి పైగా వ్యక్తులు నారాయణ్ లింబ్స్ సహాయంతో తిరిగి నడిచారని అగర్వాల్ నివేదించారు. శిబిరంలో 400 దిగువ అవయవాలు, 50 ఎగువ అవయవాలు, 55 బహుళ అవయవాలు మరియు 45 కాలిపర్‌లను అమర్చారు. సంస్థాన్ నుండి 80 మంది సభ్యుల బృందం సేవలను అందించింది, వారికి 60 మంది వాలంటీర్లు వారి సహకారానికి సర్టిఫికెట్లు అందించారు. అదనంగా, హైదరాబాద్ ఆశ్రమం నుండి కంప్యూటర్ నైపుణ్యాలు, కుట్టు మరియు కళ మరియు క్రాఫ్ట్‌లలో శిక్షణ పొందిన 85 మంది పేద మరియు వికలాంగులకు సర్టిఫికేట్‌లను కూడా ప్రదానం చేశారు.క్యాంపు కోఆర్డినేటర్లు అచల్ సింగ్ భాటి, రోహిత్ తివారీ అతిథులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఐశ్వర్య త్రివేది నిర్వహించారు.

# బక్రీద్ వేడుకలలో నారా లోకేష్..



అమరావతి, జూన్ 17 : బక్రీద్ సందర్భంగా మంగళగిరి ఈద్గాలో నిర్వహించిన ప్రార్థనల్లో మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం లోకేశ్ మీడియాతో మాట్లాడుతూ, తాము అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ముగ్గురు టిడిపి కార్యకర్తలను వైకాపా నేతలు హత్య చేసినా సంయమనం పాటిస్తున్నామన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించవద్దన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు నడుచుకుంటున్నామని చెప్పారు. తమ కార్యకర్తలకు ఆగ్రహం వ్యక్తం చేస్తే వాళ్లు ఎక్కడ ఉంటారో తెలుసుకోవాలన్నారు. రుషికొండ ప్యాలెస్ వ్యవహారంలో ఇంకా బయటికి రావాల్సిన చిత్రాలు చాలా ఉన్నాయని వ్యాఖ్యానించారు. మంగళగిరి ప్రజల కోసం మంత్రి నారా లోకేశ్ నిర్వహిస్తున్న 'ప్రజాదర్బార్'కు అనూహ్య స్పందన లభిస్తోంది. గత రెండు రోజులుగా ఆయన ప్రజా దర్బార్ పేరిట ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న విషయం తెలిసిందే. సోమవారం కూడా నియోజకవర్గానికి చెందిన ప్రజలు ఉండవల్లిలోని ఆయన నివాసానికి తరలివచ్చి తమ సమస్యలను లోకేశ్ దృష్టికి తీసుకువచ్చారు. జీతాలు పెంచాలని అంగన్వాడీ టీచర్లు, బదిలీల కోసం ఉపాధ్యాయులు, ఉపాధి కల్పించాలని నిరుద్యోగులు ఆయనకు విన్నవించారు. విద్య, వైద్య ఖర్చులకు సాయం అందించాలని పలువురు కోరారు. వైకాపా నేతలు అధికారాన్ని అడ్డుపెట్టుకుని భూములను బలవంతంగా లాక్కున్నారని, తమకు న్యాయం చేయాలని పెద్దఎత్తున ఫిర్యాదులు అందాయి. అందరి సమస్యలను ఓపికగా విన్న లోకేశ్? సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చూపుతామంటూ వారికి భరోసా ఇచ్చారు.

# కొంత మంది పోలీసు అధికారులు వైసిపికి తొత్తులుగా పని చేశారు

-ఎపి హోంమంత్రి వంగలపూడి అనిత

అమరావతి జూన్ 17 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: గత ప్రభుత్వంలో కొంత మంది పోలీసు అధికారులు వైసిపి నాయకులకు తొత్తులుగా పని చేశారని ఎపి హోంమంత్రి వంగలపూడి అనిత మండిపడ్డారు. ఆ అధికారుల్లో వైసిపి రక్తం ప్రవహించినట్లుగా వ్యవహరించారని, జగన్‌పై ప్రేమ ఉంటే ఉద్యోగానికి రాజీనామా చేసే వెళ్లొచ్చని అనిత సూచించారు. ముఖ్యంగా మహిళలకు అన్యాయం జరగకుండా చూస్తామని ఆమె స్పష్టం చేశారు. లా అండ్ ఆర్డర్ విషయంలో ఎవరు తప్పుచేసినా వదిలమని హెచ్చరించారు సింహాచలం దేవస్థానం భూములు అన్యాక్రాంతం కావడానికి వీలు లేదని, పంచగ్రామాల భూసమస్యకు త్వరలో పరిష్కారం చూపుతామని అనిత స్పష్టం చేశారు. ఎపి ప్రజలకు మంచి జరగాలని సింహాద్రి అప్పన్నస్వామిని కోరుకున్నానని పేర్కొన్నారు. సింహాచలంలో స్వామి వారిని దర్శించుకున్న అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు..

ఆహ్వానం
కిన్నెర ఆర్ట్ థియేటర్స్ 47 కిన్నెర
హైదరాబాద్



ప్రముఖ కవి డా॥ ఎన్. గోపి
అమృతోత్సవ సందర్భంగా
డా॥ ఎన్. గోపి రచించిన 75 కవితల సంపుటి
'రేపటి మైదానం'
ఆవిష్కరణ - అంకితోత్సవం
తేది: మంగళవారం 25 జూన్, 2024, సాయంత్రం 6 గంటలకు
తెలుగు విశ్వవిద్యాలయం, ఎన్‌టిఆర్ ఆడిటోరియం, పబ్లిక్ గార్డెన్స్, నాంపల్లి, హైదరాబాద్

ముఖ్యఅతిథి-ఆవిష్కర్త : డా॥ కె. శ్రీనివాస్, ఎడిటర్, ఆంధ్రజ్యోతి
సభాధ్యక్షులు : డా॥ వోలేటి పార్వతీశం, ప్రముఖ సాహితీవేత్త
కృతి స్వీకర్త : ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి, సుప్రసిద్ధ విమర్శకులు
విశిష్ట అతిథులు : ఆచార్య సూర్యా ధనంజయ, పూర్వ అధ్యక్షులు, తెలుగు శాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం
డా॥ సుంకిరెడ్డి నారాయణరెడ్డి, ప్రముఖ కవి, పరిశోధకులు
డా॥ ఎస్. రఘు, ప్రముఖ విమర్శకుడు, కవి, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు శాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం
గౌరవ అతిథులు : శ్రీ వంగల హర్షవర్ధన్, ప్రముఖ రచయిత, పూర్వ జాయింట్ కమీషనర్ (సి.టి.)
డా॥ ఎస్. జితిన్ కుమార్, ప్రముఖ రచయిత, ఆర్థోపెడిక్స్ సర్జన్
ఆత్మీయ అతిథి : శ్రీ కుడికాల వంశీధర్, ప్రముఖ కవి, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్
గ్రంథ సమాలోచనం : శ్రీ పుప్పాల శ్రీరామ్, ప్రముఖ కవి, విమర్శకులు
సభానిర్వహణ : డా॥ జె. నీరజ, అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు శాఖ, సిటీ కళాశాల

డా॥ ఆర్. ప్రభాకరరావు, I.P.S. (Retd.) అధ్యక్షులు
మద్దాళి రఘురామ్ కార్యదర్శి

# భక్తిశ్రద్ధలతో బక్రీద్.. సామూహిక ప్రార్థనల్లో ఆదిలాబాద్ ఎస్పీ గౌస్ అలం..



ఆదిలాబాద్, జూన్ 17 :త్యాగానికి, మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండుగ సోమవారం ఆదిలాబాద్ జిల్లాలో భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా జరుపుకున్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని ఈద్గా మైదానం సామూహిక ప్రార్థనలతో కిక్కిరిసిపోయింది.

ప్రధాన రహదారిపై కూడా ముస్లిం సోదరులు ప్రార్థనలు నిర్వహించగా మత గురువు ఇమామ్ బక్రీద్ పండగ ప్రాశస్త్యాన్ని, సమాజంలో నైతిక విలువలు, శాంతి సామరస్యాన్ని ప్రబోధించారు. తొమ్మిది రోజులపాటు ఉపవాస దీక్షలు చేపట్టి పండగ సందర్భంగా దీక్షలు విరమించారు.

## సామాన్యులతో కలిసి ఎస్పీ సామూహిక ప్రార్థనలు..

ఈద్గా మైదానంలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ముస్లిం సోదరుల మధ్య కలిసి ఆదిలాబాద్ ఎస్పీ గౌస్ అలం (ఐపీఎస్) సామూహిక ప్రార్థనలో పాల్గొన్నారు. అక్కడ కలిసిన ప్రతి ఒక్కరికీ పండుగ శుభాకాంక్షలు తెలుపుతూ.. శాంతి సహజీవనం అలవర్చుకోవాలని ఎస్పీ హితబోధ చేశారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి, ఆయా పార్టీల నాయకులు పండుగ సందర్భంగా ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలిపారు.

## ఎస్పీని అభినందించిన పోలీసు అధికారులు..

ఆదిలాబాద్ జిల్లాలో ఇటీవల లోక్ సభ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించినందుకు కేంద్ర ఎన్నికల సంఘం ఎస్పీకి ప్రత్యేక ప్రశంసా పత్రాన్ని అందజేసి అభినందనలు తెలిపింది. ఈ మేరకు సోమవారం ఆదిలాబాద్ డీఎస్పి ఎల్ జీవన్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ అధికారులు, సిబ్బంది సమర్థవంతంగా సేవలందించి జిల్లాకు ప్రత్యేక స్థానాన్ని నిలబెట్టిన ఎస్పీ గౌస్ అలనీను శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ పోతారం శ్రీనివాస్, సిఐలు సత్యనారాయణ, అశోక్, నాయక్ తదితరులున్నారు.

# త్రీమెన్ కమిటీ అంగీకరించిన తరువాతే రుషికొండ భవనాల నిర్మాణం

### -వైఎస్ఆర్‌సిపి నేత గుడివాడ అమర్నాథ్

విశాఖపట్నం జూన్ 17 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: రుషికొండ నిర్మాణాలపై త్రీమెన్ కమిటీ వేశామని, కమిటీ అంగీకరించిన తరువాతే రుషికొండ భవనాలను నిర్మించారని వైఎస్ఆర్‌సిపి నేత గుడివాడ అమర్నాథ్ తెలిపారు. 2014 నుంచి 19 వరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎంత ప్రజాధనం వృథా చేశారని అందరికీ తెలుసునని చురకలంటించారు. సోమవారం గుడివాడ అమర్నాథ్ మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు హైదరాబాద్‌లో ఇల్లు నిర్మించుకునే సమయంలో బాబు ప్రైవేటు హోటల్ ఉండి రూ. కోట్లు దుర్వినియోగం చేశారని మండిపడ్డారు. ఎపి రాజధాని అమరావతిలో చంద్రబాబు తాత్కాలిక భవనాలు నిర్మించారని, కానీ వైసిపి అధినేత జగన్ రుషికొండపై శాశ్వత భవనాలు నిర్మించారని ప్రశంసించారు. టిడిపి నేతలకు ధైర్యముంటే వైసిపి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూపాలని గుడివాడ అమర్నాథ్ డిమాండ్ చేశారు. లేనిపోనివి అంటగట్టి ప్రజలను మభ్యపెట్టొద్దని సూచిం చారు.

# రెండు లక్షల ఉద్యోగాలు ఎక్కడ.. కాంగ్రెస్ సర్కార్‌పై హరీశ్ గరం గరం

### -ఆశా వర్కర్లకు జీతాలు ఏవీ
### -గ్రూప్ వన్ పోస్టులు ఎందుకు పెంచలేదు
### -పింఛన్ కోసం అవ్వతాతలు పడిగాపులు

హైదరాబాద్, జూన్ 17 :తెలంగాణలో ఉద్యోగ నియామకాలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు మాజీ మంత్రి హరీశ్ రావు. నిరుద్యోగుల డిమాండ్లు నెరవేర్చకపోతే త్వరలో పెద్ద ఎత్తున పోరాటం చేస్తామన్నారు. ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలు ఏమయ్యాయని ప్రశ్నించారు.

తెలంగాణ భవన్‌లో ఇవాళ ఆయన మీడియాతో మాట్లాడుతూ? ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ గ్రూప్స్ ఉద్యోగాలు పెంచాలని అడిగిందని, మరి ఇప్పుడు ఎందుకు పోస్టులు పెంచడం లేదని నిలదీశారు.

## గ్రూప్ వన్ అర్హత రేషియో పెంచాలి.

గ్రూప్ 1 ప్రిలిమ్స్ లో పాస్ అయిన విద్యార్థులకు 1:50 కాకుండా 1:100 చొప్పున మెయిన్స్ ఎగ్జామ్‌కు అవకాశమివ్వాలని బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేస్తుందన్నారు. తద్వారా ఎంతో మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు మేలు జరుగుతుందని చెప్పారు. గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే 1:100 విధానం అమలు చేస్తామని విద్యార్థులకు హామీ ఇచ్చారని, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కూడా అసెంబ్లీ సాక్షిగా చెప్పారని గుర్తుచేశారు. ఉపముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు ఏమయ్యాయని నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వం యుతను మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాన ప్రతిపక్షంగా ప్రభుత్వాన్ని నిలదీయాలని అభ్యర్థులు బీఆర్ఎస్ కార్యాలయానికి వచ్చి వినతిపత్రం ఇచ్చారని చెప్పారు. గ్రూప్స్ పరీక్షలకు మధ్య వ్యవధి ఉండాలని అభ్యర్థులు కోరుతున్నారని తెలిపారు.

## పింఛన్‌లు ఎందుకు ఇవ్వడం లేదు..

ప్రభుత్వం వచ్చి ఆరు నెలలయిందని, ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేయలేదని విమర్శించారు. పింఛన్ ఎప్పుడిస్తారని అవ్వతాతలు అడుగుతున్నారని చెప్పారు. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు క్రమం తప్పకుండా పెన్షన్ వచ్చేదని అంటున్నారని తెలిపారు. రెండు నెలల నుంచి ఆసరా పింఛన్ రావడం లేదని వెల్లడించారు. అవ్వతాతలకు ఇచ్చిన మాటను ఎందుకు నిలబెట్టుకోలేకపోతున్నారని ప్రశ్నించారు. తక్షణమే పెండింగ్‌లో ఉన్న పింఛన్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ప్రజాపాలన పేరుతో తీసుకున్న ఆరు గ్యారంటీల దరఖాస్తులు ఏమయ్యాయని ప్రశ్నించారు. ప్రజాపాలన ఆచరణలో ఏమైందన్నారు. పేదల పట్ల ఇంత వివక్ష ఎందుకని నిలదీశారు. ఏపీ సీఎం మొదటి సంతకంతో పింఛన్ రూ.4 వేలకు పెంచారని, మీరు ఎప్పటి నుంచి ఇస్తారో చెప్పాలన్నారు. పక్కన ఆంధ్రప్రదేశ్ ఇచ్చినప్పుడు మీరెందుకు ఇవ్వలేకపోతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. వికలాంగులకు రూ.6 వేల పింఛన్ వెంటనే ఇవ్వాలన్నారు. చేనేత, గీత కార్మికులకు, ఎయిడ్స్ రోగులు, డయాలసిస్ పేషెంట్లకు బీఆర్ఎస్ హయాంలో పెద్ద ఎత్తున పింఛన్ ఇచ్చామని చెప్పారు. ఇంటికి రెండు పింఛన్లు ఇస్తామన్నారని గుర్తుచేశారు.

## ఆశా వర్కర్ల జీతాలు ఏవీ..

ఉద్యోగులకు ప్రతి నెలా 1న జీతాలు ఇస్తే ఆశా వర్కర్లు ఎందుకు వైద్యవిధాన పరిషత్‌కు వస్తారని ప్రశ్నించారు. ఎన్‌హెచ్ఎం కింద 17 వేల మంది పనిచేస్తున్నారని, వారికి వెంటనే జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఐదు నెలల నుంచి సఫాయి కార్మికులకు ఎందుకు వేతనాలు ఇవ్వలేకపోతున్నారని విమర్శించారు. వెంటనే గ్రామపంచాయతీలకు నిధులు విడుదల చేయాలన్నారు. సీఎంఆర్ఎఫ్ చెక్కులపై కేసీఆర్ బొమ్మ ఉందని ఇవ్వట్లేదని, 1.5 లక్షల మంది చెక్కుల కోసం ఎదురు చూస్తున్నారని చెప్పారు. అంగన్‌వాడీ టీచర్లు రోడ్లు ఎక్కుతున్నారని, 60వేల మంది జీతాల కోసం వేచిచూస్తున్నారన్నారు. తమ హయాంలో వారికి జీతాలు ఆపలేదన్నారు.

## నీట్ పేపర్ లీకేజ్.. ప్రధాని నోరు మెదపరేం..

అలాగే, నీట్ పరీక్షపై నీలి నీడలు కమ్ముకున్నాయన్నారు హరీశ్ రావు. కేంద్రంలో బీజేపీ తీరుతో విద్యా విధానం కుంటు పడుతుందని, 24 లక్షల మంది వైద్య విద్యార్థులు ఆగమయ్యే పరిస్థితి ఉందని చెప్పారు. పేపర్ లీకేజీ, గ్రేస్ మార్కులు కలపటం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. 67మందికి మొదటి ర్యాంక్ వచ్చిందని, పరీక్ష రాసిన ఆరుగురు విద్యార్థులకు 720 మార్కులు వచ్చాయని వివరించారు.. కేంద్ర మంత్రులు, ప్రధాన మంత్రి దీనిపై అస్సలు మాట్లాడటం లేదన్నారు.. 1563 మంది విద్యార్థులకు ఏ విధంగా గ్రేస్ మార్కులు కలిపారని ప్రశ్నిస్తూ, వారి పేర్లు, నంబర్లు ఎందుకు తెలపడం లేదని ప్రశ్నించారు.. పేపర్ లీకేజీ జరిగిందనడానికి ఇంతకన్నా నిదర్శనం ఏం కావాలన్నారు.. ఎన్నికల ఫలితాల కంటే ముందే ఈ ఫలితాలు రావటం అంటే ఏంటో అర్థం చేసుకోవచ్చన్నారు. పేపర్ లీకేజీపైన ఈడీ, సీబీఐ విచారణ ఎందుకు జరపటం లేదని ప్రశ్నించారు.

# తమిళనాడులో ఒక్క సీటును కూడా గెలుచుకోలేక పోవడం పట్ల మోడీ కన్నీరు

### -డిఎంకె సొంత పత్రిక మురసోలి సంపాదకీయంలో వెల్లడి

చెన్నై జూన్ 17 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: లోక్‌సభ ఎన్నికలలో తాము తమిళనాడులో ఒక్క సీటును కూడా గెలుచుకోలేకపోయామంటూ ఇటీవల జరిగిన ఎన్‌డిఏ ఎంపీల సమావేశంలో ప్రధాని నరేంద్ర మోడీ కన్నీటి పర్యంతమయ్యారని డిఎంకె సొంత పత్రిక మురసోలి సోమవారం తన సంపాదకీయంలో వెల్లడించింది. తాము ఎందుకు గెలవలేకపోయామో ఆయన చెప్పలేదు. అందుకు గల కారణాన్ని కూడా ఆయన గ్రహించినట్లులేదు. ఒకవేళ ఆయన గ్రహించినప్పటికీ కారణాన్ని మాత్రం ఆయన వెల్లడించరు. కారణాన్ని ఆయనచెప్పలేరు అని మురసోలి జూన్ 17 నాటి సంచికలోని సంపాదకీయంలో వ్యాఖ్యానించింది. తమిళనాడులోని డిఎంకె సారథ్యంలోని ఇండియా కూటమి ఎన్నికల రాజీకయాల కోసమే కాక సిద్ధాంపరంగా కూడా బిజెపిని ఎండగడుతోంది. 2024 లోక్‌సభ ఎన్నికల కోసం మాత్రమే ఈ కూటమి ఏర్పడలేదు. గత ఐదు సంవత్సరాలుగా ఫాసిస్టు బిజెపిపై ప్రజాస్వామిక యుద్ధాన్ని కూటమి సాగిస్తోంది. యావద్దేశానికి బిజెపి ప్రమాదకారి అని చెబుతూ గ్రామస్థాయి నుంచి సాగించిన ప్రచారంతో డిఎంకెకు, దాని మిత్రపక్షాలకు అఖండ విజయం లభించింది. బిజెపికి ఓటు వేస్తే తమిళ ప్రజలను అవమానించేనట్లేనని డిఎంకె అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ చేసిన వాదనను ప్రజలు అంగీకరించారు. తమిళనాడు, పుదుచ్చేరిలోని మొత్తం 40 లోక్‌సభ నియోజకవర్గాలలో ఇది ప్రతిబింబించింది అని మురసోలి తెలిపింది. తమిళనాడులోని మొత్తం 39 నియోజకవర్గాలు, పుదుచ్చేరిలోని ఏకైక నియోజకవర్గంలో డిఎంకె, దాని మిత్రపక్షాలైన, కాంగ్రెస్, వామపక్షాలు ఘన విజయం సాధించాయి.

# దేశవ్యాప్తంగా గవర్నర్ల మార్పుకు రంగం సిద్ధం

### -తెలంగాణకు అశ్వినీ కుమార్ చౌబే, కర్నాటకకు కిరణ్ కుమార్ రెడ్డి..

న్యూఢిల్లీ జూన్ 17 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: జాతీయ రాజకీయాల్లో వేగంగా మార్పులు జరుగుతున్నాయి. అన్ని రాష్ట్రాల గవర్నర్లను మార్చడానికి రంగం సిద్ధమయింది. కేంద్రంలోని సంకీర్ణ ప్రభుత్వం రాష్ట్రాల గవర్నర్ల మార్పులు చేర్పులు చేయబోతోంది. ప్రస్తుతం తెలంగాణకు ఉన్న ఇన్ ఛార్జీ గవర్నర్ సిపి. రాధాకృష్ణన్ పాండిచ్చేరి, జార్ఖండ్ గవర్నర్ గా కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణకు మాజీ కేంద్ర మంత్రి అశ్వినీ కుమార్ చౌబే గవర్నర్ కాబోతున్నట్లు సమాచారం. ఇదిలావుండగా తెలంగాణలో అధికారంలోకి రావడమే లక్ష్యంగా బిజెపి పావులు కదుపుతోందని తెలుస్తోంది. మోడీకి అత్యంత నమ్మకస్తుడైన అశ్వినీ కుమార్ చౌబేను తెలంగాణ గవర్నర్ గా నియమించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ కలిసివున్నప్పుడు (ఉమ్మడి ఏపి) ముఖ్యమంత్రిగా పనిచేసిన బిజెపి నాయకుడు కిరణ్ కుమార్ రెడ్డిని కర్నాటక రాష్ట్రానికి గవర్నర్ గా నియమించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# దమ్ముంటే ఇండియాలోని ఈవిఎంలను హ్యాక్ చేసి చూపాలి

### - ఎలాన్ మస్క్ కు పురందేశ్వరి సవాలు

విజయవాడ జూన్ 17 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ఈవిఎంలను హ్యాక్ చేయొచ్చని ఇటీవల ఎలాన్ మస్క్ చేసిన వ్యాఖ్యలు సంచలనం అయ్యాయి. ఈవిఎంల హ్యాకింగ్ పై పలువురు పలు రకాలుగా స్పందించారు. ఇటీవల రాహుల్ గాంధీ కూడా స్పందించారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ బిజెపి చీఫ్ పురందేశ్వరి కూడా స్పందించారు. దమ్ముంటే ఇండియాలోని ఈవిఎంలను హ్యాక్ చేసి చూపాలని ఎలాన్ మస్క్ కు సవాలు విసిరారు. ఇది ఇప్పుడు ఏపిలో హాట్ టాపిక్ గా మారింది

# కేంద్ర నిధులతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను అభివృద్ధి చేస్తా- ఎంపీ నగేష్




ఆదిలాబాద్, జూన్ 17 :ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కేంద్ర ప్రభుత్వం నిధులతో అభివృద్ధి పరుస్తానని ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్ అన్నారు. ఇవాళ మండలం కేంద్రంలో బీజేపీ విజయోత్సవ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రానికి చేరుకున్న ఎంపీ గోడం నగేష్ మొదటగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మండలంలోని వెంకటేష్ స్వామి ఆలయాన్ని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

అనంతరం నిర్వహించిన విజయోత్సవ సభలో ఎంపీ గోడం నగేష్ మాట్లాడుతూ? ఈ విజయం పార్టీ కార్యకర్తలది, జిల్లా ప్రజలదని గుర్తు చేశారు. ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రతి పనిలోనూ ముందుంటూ కేంద్ర ప్రభుత్వ నిధుల ద్వారా జిల్లాను అభివృద్ధి పరుస్తానని భరోసా కల్పించారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు పతంగి బ్రహ్మానందం మండల అధ్యక్షులు బోనగిరి స్వామి, ఉపాధ్యక్షులు నక్క ధనుంజయ్, ప్రధాన కార్యదర్శి ముత్యాల దేవన్న, బీజేవైఎం మండల అధ్యక్షులు దాతాజీ కిరణ్, తాంసి జడ్పిటిసి రాజు, కనపర్తి, చంద్రకాంత్, వెంకటస్వామి, శార్త స్వామి, నాగార్జున రెడ్డి, కాంతారావు, ఓ బి సి మోర్చా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అధ్యక్షులు ప్రణీత్ రెడ్డి, పిట్ల శేఖర్, కిసాన్ మోర్చ అధ్యక్షులు ఆడెపు శ్రీనివాస్, సోషల్ మీడియా కన్వీనర్ బత్తుల ఆశన్న, నారాయణరెడ్డి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# నారాయణ ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో యుపిఎస్సి ఆశావాదులకు మార్గనిర్దేశం



ఖమ్మం, జూన్ 17 :(నేటినిజం ప్రతినిధి): భక్తరామదాసు కళాక్షేత్రం ఖమ్మం యుపిఎస్సి ఆశావాదులకు మార్గనిర్దేశం చేయడానికి అంకితమైన విద్యావేత్తలు,మార్గదర్శకులకు సుసంపన్నమైన వాతావరణాన్ని పెంపొందించడానికి ప్రత్యేకంగా రూపొందించిన వర్క్షాప్, ఐఎఎస్ ప్రజా పరిపాలన, పాలనలో తన విశిష్ట వృత్తి జీవితం నుండి తన అమూల్యమైన అనుభవాలు, అంతర్దృష్టులను పంచుకున్నారు. ఆయన స్ఫూర్తిదాయకమైన ప్రయాణం, ఆచరణాత్మక సలహాలు హాజరైన వారి అవగాహన, యుపిఎస్సి తయారీ విధానానికి గణనీయమైన ప్రోత్సాహాన్ని అందించాయి. ఈవెంట్ ముఖ్యాంశాలు ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషనల్ ప్రోగ్రామ్స్ యుపిఎస్సి తయారీని ఇంటర్మీడియట్, డిగ్రీ కోర్సులతో సమకాలీకరించడంపై చర్చలు. నిపుణుల వ్యూహాలు మొదటి ప్రయత్నంలోనే యుపిఎస్సిపరీక్షలో ఉత్తీర్ణత సాధించడానికి ఆశావాదులకు సాధికారత కల్పించడం సమగ్ర మార్గదర్శకత్వం అగ్ర ర్యాంకులను పొందడానికి యుపిఎస్సి సిలబస్ లో ప్రావీణ్యం పొందడం ప్రత్యేక కార్యక్రమాలు ఇంటర్-ఐఎఎస్, డిగ్రీ-ఐఎఎస్ ద్వారా సమగ్ర తయారీ మెథడికల్ డీకోడింగ్ పీఎస్సీ సిలబస్ ను డీకోడ్ చేయడం ద్వారా బోధనా పద్ధతులను క్రమబద్ధీకరించడం. ప్రారంభ తయారీ పాఠశాల, ప్రారంభ కళాశాల సంవత్సరాల్లో బలమైన పునాదిని నిర్మించడంపై దృష్టి పెట్టండి. సమర్థవంతమైన అధ్యయన ప్రణాళిక సమగ్ర సిలబస్ కవరేజీని నిర్ధారించే సమగ్రమైన, సమర్థవంతమైన అధ్యయన ప్రణాళికలను రూపొందించడం. సరైన వనరులను ఎంచుకోవడం, పోటీతత్వం కోసం ఉత్తమ అధ్యయన సామగ్రిని ఎంచుకోవడం పై మార్గదర్శకత్వం. సమయ నిర్వహణ అధ్యయన షెడ్యూల్, వ్యక్తిగత జీవితాన్ని సమతుల్యం చేయడానికి చిట్కాలు ఒత్తిడి నిర్వహణ, మానసిక శ్రేయస్సును కొనసాగించడానికి, ప్రేరణగా ఉండటానికి పద్ధతులు. వ్యక్తిగత అవగాహనలు ఐఏఎస్ యొక్క అనుభవాలు, అతని కెరీర్ నుండి పాఠాలు. క్యూఅండ్ఏ సెషన్ వ్యక్తిగత సలహా కోసం నాయకులతో ప్రత్యక్ష పరస్పర చర్య శాస్త్రీయ ప్రగతిగరిష్ట అవగాహన, నిలుపుదల కోసం ఒక క్రమబద్ధమైన విధానం. స్ట్రక్చర్డ్ కరికులం సివిల్ సర్వీసెస్ పరీక్షకు సంబంధించిన అన్ని అవసరమైన అంశాలను కవర్ చేయడం. మాడ్యులర్ పరీక్షలు వాస్తవ పరీక్ష నమూనా, కష్టం స్థాయిని ప్రతిబింబించేలా రూపొందించ బడింది, బలమైన ఆర్‌డడి మద్దతుతో హాజరైనవారు తమ కృతజ్ఞతలు, ఉత్సాహాన్ని వ్యక్తం చేశారు. వారి బోధనా టూల్కిట్ ను మెరుగు పరచడంలో యుపిఎస్సి కోచింగ్ లో సహకారం, వృత్తిపరమైన అభివృద్ధికి మార్గాలను తెరవడంలో వర్క్షాప్ పాత్రను ఎత్తిచూపారు. ఇంటరాక్టివ్ సెషన్లు, నిపుణుల అంతర్దృష్టులు ముఖ్యంగా ప్రశంసించబడ్డాయి, చాలా మంది విద్యావేత్తలు, విద్యార్థులకు స్పష్టమైన ప్రయోజనాలను గుర్తించారు. ప్రశంసల చిహ్నంగా హాజరైనవారు "జూన్ 2024 నావిగేటర్ మ్యాగజైన్"యొక్క కాంప్లిమెంటరీ కాపీని అందుకున్నారు, ఇది విద్యా నైపుణ్యంలో వారి ప్రయాణానికి మరింత సహాయపడింది. పాల్గొనే వారి నుండి స్పందన "వర్క్షాప్ అద్భుతంగా నిర్వహించబడింది. చాలా తెలివైనది ఐఏఎస్ అనుభవాలు స్ఫూర్తిదాయకంగా, చాలా సందర్భోచితంగా ఉన్నాయి అని అన్నారు. పాల్గొనేవారు చర్చించిన వ్యూహాలు, పద్ధతులు నిస్సందేహంగా మా విద్యార్థులకు వారి యుపిఎస్సి ప్రయాణంలో సహాయపడతాయి. నిజంగా ఇదో అద్భుతమైన అనుభవం..! పాల్గొనే నారాయణ ఐఏఎస్ అకాడమీ పాల్గొనేవారందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తుంది, భారతదేశ పౌర సేవకుల తరువాతి తరాన్ని పెంపొందించడానికి భవిష్యత్తులో ఇలాంటి మరిన్ని కార్యక్రమాలను నిర్వహించడానికి ఎదురుచూస్తోంది.

# గాయపడ్డ కానిస్టేబుల్‌ను పరామర్శించిన ఎస్పీ కోటిరెడ్డి

హైదరాబాద్, జూన్ 17 :చికిత్స పొందుతున్న ఏఆర్ కానిస్టేబుల్ ను జిల్లా ఎస్పీ నంద్యాల కోటి రెడ్డి ఇవాళ పరామర్శించారు. వికారాబాద్ శిక్షణ కేంద్రంలో విధులు నిర్వహిస్తూ గత రాత్రి భోజనానికి వచ్చి తిరిగి విధులకు వెళ్లే క్రమంలో ద్విచక్ర వాహనం పై నుండి క్రింద పడ్డాడు.

దీంతో వికారాబాద్ పట్టణంలోని ఇషా హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ కిషన్ జీ ని జిల్లా ఎస్పీ కోటిరెడ్డి పరామర్శించి, వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి పోలీస్ డిపార్ట్ మెంట్ తరుపున ఎల్లప్పుడూ తోడుంటామని భరోసా కల్పించారు. జిల్లా ఎస్పీతో పాటుగా వీఆర్ డి ఎస్పి వీరేష్, ఆర్ ఐ డేవిడ్, తదితరులు ఉన్నారు.

# మల్కాజ్గిరి ప్రజల నమ్మకాన్ని నిలబెడతా - ఎంపి ఈటల



హైదరాబాద్, జూన్ 17 :మల్కాజ్గిరి నియోజకవర్గ ప్రజలకు ఒక సేవకుడిలా ప్రజాసేవ చేస్తానని పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ తెలిపారు..పార్లమెంట్ ఎన్నికలలో ఈటల రాజేందర్ అత్యధిక మెజారిటీతో గెలిచిన సందర్భంగా ప్రజల వద్దకే వచ్చి కృతజ్ఞతలు తెలిపే కార్యక్రమనీ. జిహెచ్ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి నేతృత్వంలో ఆదివారం నిర్వహించారు.

వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మన్సూరాబాద్ పెద్ద చెరువు ప్రాంగణంలో చెట్ల మొక్కలు నాటిన అనంతరం వివిధ కాలనీల సంక్షేమ సభ్యులతో మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యుదు ఈటల రాజేందర్ సమావేశమై పార్లమెంట్ ఎన్నికలలో ఆశీర్వదించిన ప్రజానీకానికి ప్రత్యేక కృతజ్ఞతాభివందనాలు తన ఉపన్యాసంలో తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్కాజ్గిరి పార్లమెంట్ ఎన్నికలలో నియోజకవర్గ ప్రజానీకం నా పై ఎంత నమ్మకంగా ప్రజలు ఓట్లు వేసి గెలిపించారో అంతే బాధ్యతగా మంచి సంక్షేమ పాలన రాజకీయాలకతీతంగా అందిస్తానని అన్నారు. తమ ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి కార్పొరేటర్లకు పూర్తి సహకారం ఉంటుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నాయకత్వ సహకారంతో చట్టసభల్లో మంచి విప్లవాత్మక మార్పులు చేసే దానిలో మా నాయకుడు ఉంటాడని తల ఎత్తుకునేలా నా నియోజవర్గ ప్రజలు చెప్పుకునే విధంగా పేరు తెచ్చుకుంటానని పేర్కొన్నారు.

తన గెలుపులో కీలక బాధ్యతలు నిర్వహించిన నాయకులకు, కార్యకర్తలకు, వివిధ సంఘాల నాయకులకు, మరియు ఓట్లు వేసిన గెలిపించిన మల్కాజ్గిరి ప్రజానీకానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు సామారంగారెడ్డి, కొత్త రవీందర్ గౌడ్, కుంట్లూరు వెంకటేష్ గౌడ్, వనపల్లి శ్రీనివాస్ రెడ్డి, నాంపల్లి రామేశ్వర్,వివిధ కాలనీల సంక్షేమ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యశాఖను అనారోగ్య శాఖగా మార్చిన ఘనత జగన్మోహన్ రెడ్డిదే..

### -ప్రభుత్వ ఆసుపత్రుల ప్రక్షాళన దిశగా ముందుకు..
### -వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్

తిరుపతి జూన్ 17 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: రుయా ఆసుపత్రిలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యకుమార్ మాట్లాడుతూ.. ఆరోగ్యశాఖను అనారోగ్య శాఖగా మార్చిన ఘనత జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ఆరోగ్యశ్రీలో జరిగిన అవకతవకలపై విచారణ జరిపిస్తామన్నారు. గత ప్రభుత్వంలో వైద్య, ఆరోగ్య శాఖలో అవినీతికి పాల్పడ్డ ఏ ఒక్కరిని వదిలిపెట్టబోమన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు అవసరమైన సహకారాన్ని కేంద్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల ప్రక్షాళన దిశగా ముందుకెళుతున్నామని సత్యకుమార్ తెలిపారు. రోగుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తే ఉపేక్షించేది లేదన్నారు. వైద్య సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఖచ్చితంగా చర్యలు ఉంటాయని సత్యకుమార్ అన్నారు. రుయా ఆసుపత్రిలో ఎక్స్ రే మిషన్లు పాతవేనన్నారు. ఓపి కోసం గంటల తరబడి రోగులు వేచి చూడాల్సి వస్తోందన్నారు. రిషికొండలో జగన్ ఇచ్చిన హంగూ, ఆర్భాటం చూసి ఆశ్చర్యమేసిందని తెలిపారు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన వ్యక్తిగా జగన్ చరిత్రలో నిలిచిపోతాడని ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ పేర్కొన్నాడు.

# గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏం జరిగిందో లెక్కలు చూడాల్సిందే

### - తాను రాష్ట్రానికి మంత్రిని అయినా.. అనంతపురం జిల్లాకు కూలీనే..
### - ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్

అనంతపురం జూన్ 17 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: అనంతపురం జిల్లాను అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ హామీ ఇచ్చారు. తాను రాష్ట్రానికి మంత్రిని అయినా.. అనంతపురం జిల్లాకు కూలీనేనని తెలిపారు. తాగు, సాగునీటి కోసం జరిగిన పోరాటాల మధ్య తాను పెరిగానని చెప్పారు. జిల్లా ప్రజలు చూపిస్తున్న అభిమానాన్ని ఎప్పటికీ మరువలేనని అన్నారు. జిల్లా రైతాంగాన్ని ఆదుకునేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని మాటిచ్చారు. జిల్లా ప్రజల నమ్మకానికి మించి పని చేస్తానని అన్నారు. ఆర్థిక మంత్రిగా అత్యంత బరువు బాధ్యతలు మోయాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వ ఖజానాకు సంబంధించి ఇంతవరకు లెక్కలు చూడలేదని అన్నారు. లెక్కలు చూస్తే అన్ని విషయాలు తెలుస్తాయని చెప్పారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏం జరిగిందో లెక్కలు చూడాల్సిన అవసరముందని అన్నారు. రాష్ట్రాన్ని బాగు చేయాలి.. అభివృద్ధి పరుగులు పెట్టించాలని కోరారు. ఇదే ఆశయంతో మీ నమ్మకాన్ని వమ్ము చేయకుండా పని చేస్తానని మంత్రి పయ్యావుల కేశవ్ హామీ ఇచ్చారు.

# మానవత్వాన్ని చాటుకున్న భద్రాద్రి కలెక్టర్..

ఖమ్మం, జూన్ 17 :భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ మానవత్వాన్ని చాటుకున్నారు. బూర్గంపహాడ్ మండలం సారపాక క్రాస్ రోడ్డు వద్ద ఆటో, బైక్ ఢీకొన్నాయి.. ఈ ఘటనలో బైక్‌పై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులు, ఆటోలో ప్రయాణిస్తున్న మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి.

అదే సమయంలో అటుగా వెళుతున్న కొత్త కలెక్టర్ జితేష్ పాటిల్ వెంటనే తన వాహనాన్ని ఆపి క్షతగాత్రులను సొంత వాహనంలో ఆస్పత్రికి పంపి మానవత్వం చాటుకున్నారు. కొత్త కలెక్టర్‌గా విధులకు హాజరైన వెంటనే కలెక్టర్ జితేష్‌పాటిల్ చూపిన మానవతా విలువలపై జిల్లా ప్రజలు ప్రశంసలు కురిపించారు.

